ప్రజాశక్తి ఆదివారం అనుబంధం



కథా నిలయం
శ్రీకాకుళం
Entered

స్నేహ

జనవరి 13, 2008

పల్లె జీవుల పల్లవి
సంక్రాంతి

హ్యాపీ బర్త్‌డే

(జనవరి-13 నుంచి జనవరి-19 వరకు)

టి. మణితేజ్
1సం॥, జనవరి-13
ప్రేమలత-వెంకటేష్‌గౌడ్
ఇబ్రాహీంపట్నం-రంగారెడ్డి

టి. వేణుమాధవ్
9సం॥, జనవరి-13
శేషఫణి-స్వామి
రాపర్తినగర్-ఖమ్మం

తృప్తి
9సం॥, జనవరి-13
చంద్రకాంత-మనోజ్
డోర్నకల్-వరంగల్

మానస
7సం॥, జనవరి-13
ధనలక్ష్మి-మల్లేష్
బోడబండ్లగూడ-నల్లగొండ

ఎ. స్నేహ
3సం॥, జనవరి-13
రమాదేవి-మాల్యాద్రి
ఒంగోలు-ప్రకాశం



బి. సాయిచరణ్
జనవరి-13
ఇందిరాలక్ష్మి-రాధాకృష్ణమూర్తి
రామలింగాపురం-నెల్లూరు

ఎస్. ఐశ్వర్య
1సం॥, జనవరి-16
భాగ్యలక్ష్మి-శ్రీనివాస్
డోర్నకల్-వరంగల్

ఐ. లక్ష్మీనర్సింహనాయుడు
3సం॥, జనవరి-17
మధురిమ-శ్రీరామమూర్తి
డోర్నకల్-వరంగల్

బి. జ్యోతిక
3సం॥, జనవరి-17
చిన్నా-మాణిక్యరావు
గుండ్లపాలెం-గుంటూరు

షేక్ నూర్జహాన్
7సం॥, జనవరి-2001
షమీనా-మదీనా
హైదరాబాద్

వి. గీతిక
3సం॥, జనవరి-13
రాధ-రాముడు
గొందిపర్ల-కర్నూలు

కె. సార్దీనా
4సం॥, జనవరి-19
సుజన-మధు
డోర్నకల్-వరంగల్

పి. సాయి భరద్వాజ్
10సం॥, జనవరి-18
శ్రీదేవి-చక్రవర్తి
కూకట్‌పల్లి-హైదరాబాద్



కవిన్
1సం॥, జనవరి-2007
మాణిక్యమ్మ-మణిక్యప్ప
దామరగిద్ద-మ॥నగర్

కె. చక్రధర్
7సం॥, జనవరి-18
శారద-వెంకటస్వామి
వనపర్తి-మ॥నగర్

కె. జ్ఞానదీప్
10సం॥, జనవరి-1998
శాంద-వెంకటస్వామి
వనపర్తి-మ॥నగర్



వివేక్
1సం॥, జనవరి-2007
బాల-యాదగిరి
ఓల్డ్‌బోయిన్‌పల్లి-సికింద్రాబాద్

ఎ. యశ్విత
4సం॥, జనవరి-2004
జయలక్ష్మి-సైదేశ్వరరావు
వైరా-ఖమ్మం



కె. అరవింద్‌కుమార్
5సం॥, జనవరి-2003
రాజేశ్వరి-శర్మ
భద్రాచలం-ఖమ్మం

ఎ. వరుణ్ కుమార్
వెంగమాంబ-వెంకటేశ్వరరావు
మైలవరం-కృష్ణా

ప్రేంచంద్
9సం॥, జనవరి-16
సత్యవతి-రాము
ధర్మవరం-ఖమ్మం

కథా నిలయం
శ్రీకాకుళం



టీవీ రాకతో పఠనాసక్తి తగ్గింది

మన అతిథి

పేరు	:	పుట్టగుంట సూర్యప్రకాశరావు
తల్లిదండ్రులు	:	సీతారత్నమ్మ, వెంకటకృష్ణయ్య
స్వగ్రామం	:	కనుమూరు (కృష్ణా జిల్లా)
పుట్టిన తేదీ	:	14-01-1934
విద్యార్హత	:	ఇంటర్
వృత్తి	:	పుస్తకాల ప్రచురణ (1960లో నవభారత్ పబ్లికేషన్ స్థాపించాను)
స్ఫూర్తి	:	5వ తరగతి నుండీ ఎస్.ఎఫ్.ఐలో పని చేశాను. వై.వి. కృష్ణారావు, యలమంచిలి బాలకోటయ్య ప్రభావంతో కమ్యూనిస్టు పార్టీకి సన్నిహితమై, విశాలాంధ్ర ప్రెస్ మేనేజర్‌గా 1953లో చేరాను. విస్తృతంగా కమ్యూనిస్టు సాహిత్యాన్ని చదివాను.

ప్రచురణలు-ప్రత్యేకతలు: పాఠకులకు ఏం కావాలో అదే అందించాం. ఎక్కువగా నవలలు ప్రచురించాం. సెక్రెటరీ, విజేత, మీనా, జీవన తరంగాలు, మీ ఇంట్లో మీరే డాక్టరు....ఎక్కువ ముద్రణలు పొందాయి. మేం ప్రచురించిన పుస్తకాలకు నా ముందుమాట, కవర్ పేజీ, చివరి పేజీలలో ప్రత్యేకత కనిపించేది. టైటిల్స్ పెట్టడంలో కూడా మా కంటూ ఒక ఒరవడి ఉండేది.

ఇష్టమైనది : అందరి చేతా మంచి అనిపించుకోవడం

ఆనందం కల్గించే విషయం: ఏ గ్రంథాలయానికి వెళ్ళినా అక్కడి గ్రంథాలలో అగ్రభాగాన మా సంస్థ పుస్తకాలే నిలవడం.

ఇష్టమైన రచనలు: కారల్‌మార్క్స్ 'కమ్యూనిస్టు మేనిఫెస్టో', శరత్ 'విప్రదాసు', కొ.కు 'పంచ కళ్యాణి', గోపీచంద్ 'చీకటి గదులు'.

ఇష్టమైన వ్యక్తి: నవోదయ రామమోహనరావు

పాఠకులు మొదట్లో లబ్దప్రతిష్టులైన రచయితల పుస్తకాలన్నీ చదివేవారు. పట్నాలకు వలస వచ్చిన వారికి ఆధునిక గృహోపకరణాలు తోడై పని సులభమైంది. దాంతో రీడింగ్ హేబిట్ పెరిగింది. వారు కుటుంబ కథలపై మోజు పెంచుకున్నారు. అలాంటివి విరివిగా చదివేశారు. 1980 తరువాత రచయితల నవలల్లో రొటీన్ కథలు ఉండేసరికి మరలా కొత్తదనం కోసం పాఠకులు ఎదురు చూశారు. ఆ తరుణంలో యండమూరి, మల్లాది రచనలు బాగా పాపులర్ అయ్యాయి. ఆ రచనలలో సస్పెన్స్, స్పీడు, సైన్స్ ఫిక్షన్ మిళితమై ఉండేవి. తరువాత వాటిలోని పెడధోరణులు నచ్చక మెడికల్‌కు సంబంధించిన పుస్తకాలు కోరుకున్నారు. లెఫ్ట్ భావజాలం తగ్గడం వల్ల ఆధ్యాత్మికం, వాస్తు, జ్యోతిష్యం ఇత్యాది పుస్తకాలు విరివిగా వస్తున్నాయి. టీవీల రాకతో ప్రస్తుత పరిస్థితుల్లో పఠనాసక్తి తగ్గింది. ప్రభుత్వ గ్రంథాలయాలకు సరఫరా చేసే పుస్తకాలు సరైన స్థాయిలో ఉండటం లేదు. స్కీముల పేరుతో రకరకాల నిబంధనలు పెడుతున్నారు. వాటిలో నిరుపయోగమైన పుస్తకాలే ఎక్కువగా ఉంటున్నాయి. ఈ విషయం ఏ గ్రంథాలయానికి వెళ్లినా తెలుస్తుంది. ఆమ్యామ్యాల ప్రభావం పెరిగింది. అందుకు తట్టుకుని నిలదొక్కుకోగలిగిన వారే ప్రస్తుతం పబ్లిషర్‌గా నిలబడగలుగుతున్నారు.

ఈ సంచికలో....

టపా	...	2
కవిత్వమ్	...	3
విజ్ఞాన వీచిక	...	4
ఆరోగ్యం	...	5
సీరియల్	...	8
మనసా... తెలుసా...	...	10
సినిమా కబుర్లు	...	11
బాలనేస్తాలు	...	12

ఇంకా...

మంచిపుస్తకం ...6

బుల్లితెర వెనక
అల్లిక- అమరిక



చూద్దామా...22

అరుదైన పక్షుల సంరక్షణ కేంద్రం
రోళ్ళపాడు అభయారణ్యం

అట్టమీది కథ	...	14
లాహిరి లాహిరిలో	...	20
రుచి	....	23
నవ్వుల్ పువ్వుల్	...	24

కథ ... 18
నివాళి

ఆశ్చర్యపోయాం

2007 చివరి ఆదివారం సంచిక అట్టమీది కథగా... నేలంటి మధుగారి రచన "అందరికీ హ్యాపీ న్యూ ఇయర్" ద్వారా కాల నిర్ణయ పద్ధతులు... నూతన సంవత్సర వేడుకల ఉదంతాలు వంటి అనేకానేక విశేషాలు... తెలుసుకున్నాం. "నవ్వుల్ - పువ్వుల్" ద్వారా చక్కటి జోక్స్ చదివి నవ్వుకున్నాం. మంచిపుస్తకంలో డాక్టర్ మహీధర ప్రతిష్ఠాత్మక రచన ... "కాలజ్ఞానమిచ్చే కేలండర్ కథ" పుస్తకాన్ని పరిచయం చేయడం కొత్త సంవత్సర ఆరంభశుభ సందర్భంలో చాలా చాలా బాగుంది. విజ్ఞాన వీచికలో పేర్కొన్న... అమెరికా తరహా అభివృద్ధి పర్యావరణ విధ్వంసం మీద ఆధారపడి ఉండడం, వినియోగదారీ సంస్కృతిపై అమెరికా ఆర్థిక వ్యవస్థ నడుస్తుండడం విస్మయంగానే తోస్తోంది. "బాలనేస్తాలు" లో... తొమ్మిది మోహాలు కనిపించాయా? అంశం మమ్మల్ని ఆశ్చర్య చకితుల్ని చేసింది. "అమెరికన్ డేగ" ఆసక్తికరంగా కొనసాగుతోంది. పుస్తకాల ధరలు సామాన్యుల కొనుగోలు శక్తికి మించి ఉన్నాయని, వారికి అందుబాటులో ఉండాలని కాంక్షించే వారిలో ప్రథముడిగా ఈ వారం మన అతిథి "రావెల సాంబశివరావు"ను చెప్పవచ్చు.

నేమాన సుభాస్ చంద్రబోస్,
శ్రీకాకుళం టౌన్.

ధన్యవాదాలు

23.12.07 నాటి స్నేహ కవర్ స్టోరీ '200 సంవత్సరాల కడప జిల్లా వ్యాసం' చాలా బాగుంది. ఆ జిల్లాకు సంబంధించిన సమాచారాన్ని మిగతా ప్రాంతాల ప్రజలకు చెప్పిన విధానం అభినందనీయం. వీరబ్రహ్మంగారు, యోగి వేమన వంటి చారిత్రక వ్యక్తులు పుట్టిన గడ్డ అది. ఇక అక్కడ చారిత్రక ప్రదేశాలకు కొదవేలేదు. సినిమా రంగానికి అమూల్యమైన నటులను అందించింది కడపజిల్లా. 200 సంవత్సరాల పండుగ జరుపుకుంటున్న శుభతరుణంలో ఆ జిల్లాకు చెందిన రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా వుండడం కాకతాళీయమే అయినా చెప్పుకోదగిన విషయం. బ్రహ్మణీ స్టీల్, రాజీవ్ గాంధీ మెడికల్ కాలెజి, వేమన వర్సిటీ, జె.ఎన్.టి.యు బ్రాంచి, ట్రిపుల్ ఐటి మొదలైనవి కొత్తగా కడపజిల్లాకు అందిన అభివృద్ధి ఫలాలు. చక్కని కవర్ స్టోరీ అందించినందుకు ప్రజాశక్తికి ధన్యవాదాలు.

మార్టూరు అజయ్‌కుమార్,
చిలుకలూరి పేట.

ఇది సినిమావాళ్లు తప్పక చదవాలి

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం ('స్నేహ')లో అట్టమీద కథగా దుర్గాప్రసాద్ అందించిన 'కడపకు 200 ఏళ్ళు'లో కడప ప్రాధాన్యతను మిగతా జిల్లాల వారికి ఎంతో చక్కగా వివరించారు. ఇన్ని కళల పుట్టిల్లయినా కడపను బాంబుల తయారీ స్థలంగానే 'ఫిక్స్' చేసిన సినిమా వాళ్లు ఇలాంటి రచనలు చదివి తీరాలి. 'ఆరోగ్యం'లో మెదడు ఆరోగ్యంగా ఉండాలంటే ఏఏ జాగ్రత్తలు తీసుకోవాలో, చాలా చక్కగా తెలియజేశారు. 'కృతజ్ఞత' కథ చాలా బాగుంది. ముఖ్యంగా మరో అంశం... "సమాధుల మధ్యే భోజనం" స్కెచ్ చదివి, విస్తుపోవడం మా వంతయింది. నిజమే, జనాభా ఎంతో వేగంగా పెరిగిపోతున్న మనలాంటి దేశంలో... స్మశానం పక్కనే నిదురించినా సమాధుల పక్కనే విందారగించినా పెద్ద విశేషం కాదేమోననిపించింది. మానవత్వమే పరమార్థం అంటున్న ఈ వారం మన అతిథి "లక్ష్మణ్ అయ్యర్ రామస్వామి"గారు చెప్పిన, ప్రతి ఒక్క మాట కూడా మనందరం ఆచరించ దగినది. స్వార్థాన్ని తగ్గించు కుని, మానవత్వం వైపు మొగ్గు చూపుతూ... ఆపదలో ఉన్నవారిని, ఆదుకోవాలన్న వారి ఉద్బోధ, సరియైన లక్ష్యంతో పట్టుదలతో కృషి చేస్తే జీవితం విజయవంతం అవుతుందన్న వారి ఉవాచ ఆచరణీయంగా ఉంది.

ఎన్.ఎస్.సిహెచ్.బి, శ్రీకాకుళం.

విజ్ఞాన వీచిక బాగుంది

నేటి భూగోళంపై పర్యావరణ విధ్వంసం జోరుగా సాగుతోంది. పర్యావరణ శాస్త్రజ్ఞుల నివేదికలను ప్రభుత్వాలు బుట్ట దాఖలు చేశాయి. పర్యావరణ విధ్వంసంలో ప్రథమ ముద్దాయి ప్రభుత్వమే. అభివృద్ధి పేరుతో మార్కెట్ పాలసీకి పెద్ద పీట్ట వేసింది. ఆరోగ్యంలో 'వెన్నుపూసలు అరిగితే'



వ్యాసం బాగుంది. నేడు ఎక్కువ మంది యువకులు వెన్ను నొప్పితోనే బాధపడుతున్నారు. వ్యాసం మరి కొంత సమాచారంతో ఉంటే బాగుండేది. ఆదివారం అను బంధాన్ని విజ్ఞానదాయకంగా అందిస్తున్నందుకు అభినందనలు.

టి. శ్రీరామమూర్తి,
గాజువాక, విశాఖ.

'ఇక చాలు' బాగుంది

అందరికీ... హ్యాపీ న్యూ ఇయర్. నూతన సంవత్సరాన్ని స్వాగతిస్తూ అందించిన అట్టమీది కథ ముఖచిత్రం బాగుంది. ఈమధ్య కాలంలో ఎక్కువగా చిన్న పిల్లలపై అత్యాచారాలు జరుగుతున్న సంఘటనలను ఇతివృత్తంగా జేసుకుని అందించిన కొమ్మాలపాటి అల కథ "ఇక చాలు" రచన చాలా బాగుంది. లాహిరి లాహిరిలో ప్రముఖ గాయని వాణీ జయరాం గురించి తెలియజేయడం సంగీత ప్రియులకు ఎంతో ఆనందాన్నిచ్చింది. ఈ వ్యాసం స్ఫూర్తిదాయకంగా వుంది.

కె. కాశీవిశ్వేశ్వరరావు,
మర్రిపాలెం, విశాఖ.





కవిత్వమ్

గత్తం వెంకటేశ్వర రావు

మట్టి మనిషి



ఈ హిమ శైశిర సుప్రభాతంలో
తొలి వెలుగు తనకొకటి
తూర్పు వాకిట పాటమరించిన వేళ
చిగురుటాకుకు చివర అంచున
తుహిన కిరణం తారటాడిన
తళుకు మెరుపును చూచినప్పుడు
ఏటికేతాము లెత్తిన పాటుకు
నీ నుదుట నిలిచిన స్వేదకణమల్లే
కను చెదరి కనిపించి
మట్టి మనిషివి నీవు
నా గమనానికి వస్తావు!

ముద్దబంతు లెర్ర చేమంతిక చేర్చి
ముచ్చటైన ముస్తాబులతో
వాకిట కట్టిన సిరి తోరణాల
బాటల తీరులు చూస్తే
నీవు దున్నిన దుక్కుల చాలుల్లో
కండలు కరిగిన చారికలెన్నో
చూచాయగా కనులకు కనిపించి
మట్టి మనిషివి నీవు
నా గమనానికి వస్తావు!

మెడలో మువ్వల రంగుల కొమ్ముల
బసవయ్యలు తలలూపుతు
అయ్యలమ్మలకు దణ్ణాలెడుతూ
వాకిటి ముందుకు నడిచొస్తే
మూపున కెత్తిన మేడిని మోసే
కోడెల నదిలిస్తూ
చాలు చాలుకు ధారలు పోసిన
నీ కాయపు కష్టం కనులకు కట్టి
మట్టి మనిషివి నీవు
నా గమనానికి వస్తావు!

భోగినాళ్ళ చలిమంటల కాపులతో
చెలరేగిన అగ్నుల జ్వలనం చూస్తే
మండుటెండల ఎండ వేళల
చెమటలోడ్చిన నీ కఠిన కష్టం
మరిగే ఉష్ణ గుండమల్లే కనిపించి
మట్టి మనిషివి నీవు
నా గమనానికి వస్తావు!

అంబనో జగదంబనో
పలికించు ప్రజ్ఞతో
డమరుకు పట్టి డుముక్కు వాయించి
పండుగ వేళల జంగమ వస్తే-
చినుకు కోసం - తెలియని భవితవ్యం కోసం
మింటి వంకకు మోర లెత్తిన
నీ జాలి చూపుల దైన్యమంతా
మనసు మాటున హత్తినట్లే
మట్టి మనిషివి నీవు
నా గమనానికి వస్తావు!

లోగిళ్ళ ముంగిళ్ళ సానుపులు తీర్చి
ముత్యాల ముగ్గు చదరాలు పరిచి
ముద్దరాలుంచిన గొబ్బి ముద్దలలో
నీవు ఎత్తిన మట్టి పిడికిలి
కనుల ముందర కట్టినట్టె
మట్టి మనిషివి నీవు మరి మరీ
నా గమనానికి వస్తావు
"మకర సంక్రాంతి" వేళల.

❊

విజ్ఞాన వీచిక

ఎస్. వెంకట్రావు

అంగారకునివైపు దూసుకొస్తున్న 'ఆస్టరాయిడ్'

అతివేగంగా వస్తున్న ఒక గ్రహశకలం (ఆస్టరాయిడ్) ఈ నెల 30న అంగారక గ్రహాన్ని ఢీకొట్టే అవకాశాలున్నాయని 'ఆకాశాన్ని చదువుతున్న' అమెరికా శాస్త్రవేత్తల బృందం ఒకటి సంచలనాత్మక ప్రకటన చేసింది. అమెరికాలోని ఆరిజోనా రాష్ట్రంలో గల శాంతా కాటలినా పర్వతాల్లోని లెమన్ పర్వతం మీద నెలకొల్పబడిన 60 అంగుళాల టెలిస్కోప్పునుండి ఆకాశాన్ని పరిశీలించిన ఖగోళ శాస్త్రవేత్తల బృందం అంగారక గ్రహం వైపుగా వస్తున్న ఈ గ్రహశకలాన్ని గత నవంబర్ 20న గుర్తించింది.

164 అడుగుల వెడల్పున్న ఈ గ్రహశకలం అంగారక గ్రహానికి 30,000 కిలోమీటర్ల పరిధిలోకి వచ్చి దాన్ని దాటుకుంటూ ఎటో పోతుంది. ఈ క్రమంలో అది అంగారక గ్రహాన్ని ఢీకొట్టడానికి 75 వంతుల్లో ఒక వంతు అవకాశం ఉందని శాస్త్రవేత్తలు చెప్పారు. కాటలినా స్కై సర్వే బృందానికి చెందిన ఆండ్రియా బోట్టినీ అనే శాస్త్రవేత్త దూసుకువస్తున్న ఈ గ్రహశకలాన్ని తొలుత కనుగొన్నాడు. నవంబరు 20న ఆయన మొదటి సారి ఆకాశంలో ఈ గ్రహశకలాన్ని చూసినప్పుడు అది చాలా కాంతి విహీనంగా కనిపించింది. ఎంత విహీనంగా అంటే నీలాకాశంలో మన కంటికి కనిపించే నక్షత్రాల్లో అత్యంత కాంతివిహీనమైన నక్షత్రంలో 4 లక్షల వంతు కాంతితో అది కనిపించింది.

గ్రహాలవైపుగా వస్తున్న ఇటువంటి గ్రహశకలాలను దూసుకువస్తున్న గ్రహశకలాలు (అప్రోచింగ్ ఆస్టరాయిడ్స్) అంటారు. అటువంటి గ్రహశకలాలు గ్రహోపరితలాన్ని తాకవచ్చు తాకకపోవచ్చు. కాని తాకే అవకాశాలు ఉన్న గ్రహశకలాలను మాత్రమే ఈ పేరుతో పిలుస్తారు. అయితే వీటిలో అత్యధిక భాగం చిన్నవిగా ఉంటాయి, కనుక గ్రహోపరితలాన్ని తాకినా పెద్దగా ప్రభావం ఉండదు. ఇటువంటి దూసుకువస్తున్న గ్రహశకలాలు గతంలో భూమిని కూడా తాకాయి. నిజానికి ప్రతి నిత్యం ఇటువంటి శకలాలు భూమిని చేరుతూనే ఉంటాయి. అయితే భూమిపై వాతావరణం ఉన్నందువల్ల అవి భూమి వాతావరణంలోకి ప్రవేశించిన వెంటనే గాలితో రాపిడికి మండిపోతాయి. అవే మనకు ఆకాశంలో ఉల్కలుగా కనిపిస్తాయి. కాని కాస్త పెద్ద గ్రహశకలాలైతే కాలిపోగా కొంచెం మిగిలిపోయి ఎక్కడో అక్కడ భూమిని తాకుతుంటాయి. ఒక్కోసారి అటువంటి వాటివల్ల స్థానిక ప్రజలకు నష్టం జరుగుతుంటుంది కూడా. కాని అవే గ్రహ శకలాలు మరింత పెద్దవైతే అంటే ఒక కిలోమీటరు వ్యాసం కలిగి ఉంటే మాత్రం భూమికి పెద్ద ప్రమాదమే సంభవిస్తుంది.

ఉదాహరణకు ఇప్పుడు అంగారక గ్రహంవైపు దూసుకు వస్తున్న గ్రహశకలం వంటిదే 50,000 సంవత్సరాల క్రితం భూమిని తాకింది. అమెరికాలోని ఆరిజోనా రాష్ట్రంలో అది తాకిన చోట ఒక పెద్ద విశాలమైన గొయ్యి ఏర్పడింది. ఇటువంటి గొయ్యిని క్రేటర్ అంటారు. ఆరిజోనా క్రేటర్ అలా ఏర్పడిందే. ఇప్పుడు అంగారకునిపైకి దూసుకువస్తున్న గ్రహశకలం గనుక ఆ గ్రహాన్ని తాకితే ఇటువంటిదే పెద్ద క్రేటర్ ఏర్పడుతుంది. ఆరిజోనా క్రేటర్ ఏర్పరిచిన గ్రహశకలం ఒక పెద్ద లోహపు ముద్ద. ప్రస్తుత గ్రహశకలం కూడా అటువంటి లోహపదార్థమేనని కాలిఫోర్నియాలోని పసడేనాకు చెందిన జెట్ ప్రొపల్షన్ లేబరేటరీ శాస్త్రవేత్తలు విశ్లేషించారు. ఈ గ్రహశకలం జనవరి 30న అంతర్జాతీయ కాలమానం ప్రకారం ఉదయం ఆరుగంటల సమయంలో అంగారకుని వద్దకు వస్తుంది. ఒకవేళ అది అంగారకుని తాకితే గ్రహ ఉత్తర ప్రాంతంలో తాకుతుంది. ఆ ప్రాంతంలో ప్రస్తుతం అమెరికాకు చెందిన 'ఆపర్చునిటీ రోవర్' పరిశోధనలు చేస్తోంది. గ్రహశకలం బుల్లెట్ వేగానికి 15 రెట్లు అధిక వేగంతో అంగారకునివైపు దూసుకొస్తోంది.

ఇటువంటి గ్రహ శకలం గనుక భూమిని తాకితే భూమిమీద అత్యంత శక్తివంతమైన హైడ్రోజన్ బాంబు పేలుడుకన్నా 24 రెట్లు అధిక ప్రభావం కలుగజేస్తుంది. అంటే ఒక పెద్ద ప్రళయమే సంభవిస్తుందన్న మాట.

నిజానికి ఇటువంటి పెద్ద గ్రహశకలాలు మన సూర్య కుటుంబంలో కొన్ని లక్షల సంఖ్యలో ఉన్నాయి. వాటిలో కొన్ని వేలు నిత్యం భూమికి దగ్గరగా వస్తూ వుంటాయి. వాటిలో భూమిని తాకే అవకాశాలు ఉన్నవి కూడా ఎప్పుడో ఒకప్పుడు మన దృష్టిలో పడవచ్చునని శాస్త్రవేత్తల భావన. ఇటువంటి గ్రహశకలాలను 'భూమికి చేరువలోకి వచ్చే వస్తువులు' (నియర్ ఎర్త్ ఆబ్జెక్ట్స్- ఎన్.ఇ.ఓ-నియో) అంటారు. 'నియో'లవల్ల భూమికి ప్రమాదం సంభవించే అవకాశం ఉంది కనుక వాటిపై ఒక కన్నేసి ఉంచాలని అమెరికా ప్రభుత్వం అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ 'నాసా'ను ఆదేశించింది. దీనికోసమై 'నాసా' నాలుగు చోట్ల ఆకాశాన్ని సర్వే చేసే లేబరేటరీలను నెలకొల్పింది. వీటిలో కాటలీనా స్కై సర్వే కూడా ఒకటి. ప్రస్తుతం అంగారకుని వైపుకు వస్తున్న గ్రహశకలాన్ని ఈ సంస్థకు చెందిన శాస్త్రవేత్తలే గుర్తుపట్టారు. స్కై సర్వే చేసే శాస్త్రవేత్తలు ప్రతి ఏటా కొన్ని వందల నియర్ ఎర్త్ ఆబ్జెక్ట్స్ (నియో)లను కనుగొంటుంటారు. ఒక కిలోమీటరుకన్నా వెడల్పున్న గ్రహశకలాల వివరాలు మాత్రమే వారు సేకరిస్తారు. 2005లో 310 'నియో'లను కనుగొనగా 2006లో 400 కనుగొన్నారు. 2007 చివరి పదకొండు మాసాల్లో 450 నియోలను గుర్తించారు. ఒక నియోను కనుగొనగానే శాస్త్రవేత్తలు దానికి ఒక పేరుపెట్టి దాని గమనాన్ని నిత్యం పరిశీలిస్తుంటారు. ఉదాహరణకు ప్రస్తుతం అంగారకునివైపుగా వస్తున్న గ్రహశకలానికి శాస్త్రవేత్తలు '2007 డబ్ల్యుడి5' అని పేరు పెట్టారు. ఇటువంటి నియోలలో భూమిని తాకే అవకాశాలు ఎంతవరకు ఉన్నాయో తెలుసుకుంటుంటారు. ఒక వేళ అటువంటి శకలం ఏదైనా భూమిని తాకుతుందని తెలిస్తే దాని గమనాన్ని మార్చడానికి శాస్త్రవేత్తలు ప్రణాళికలు రచిస్తారు. అయితే ఇప్పటి వరకు హాలీవుడ్ సినిమాల్లో మినహా నిజంగా భూమిని తాకడానికి దూసుకువచ్చే గ్రహశకలం ఏదీ శాస్త్రవేత్తల 'కంట' పడలేదు. అయినా 'పొంచివున్న ప్రమాదం'పై నిత్యం కన్నేసి ఉంచడం మంచిదే కదా! ఈ విషయంలో 'నాసా' శాస్త్రవేత్తలు చేస్తున్న కృషి అమెరికాకే కాకుండా ఈ భూ గోళం మొత్తానికి ఉపయోగపడుతుంది.

❋

ఆరోగ్యం

ఫాటీ లివర్ అంటే...?

డా॥ ధర్మేష్ కపూర్
కాలేయ చికిత్సా నిపుణులు,
గ్లోబల్ హాస్పిటల్స్, హైదరాబాద్.



కాలేయ కణాలలో కొవ్వు పేరుకుపోవడాన్ని 'ఫాటి లివర్' అంటారు. ఇది మామూలు పరిస్థితి కాకపోయినా, కాలేయంలోని కొవ్వువల్ల అపకారం జరగదు. కాకపోతే చాలా ఆరోగ్య సమస్యలకు ఇది నిదర్శనం. ఫాటిలివర్‌వల్ల ఇన్‌ఫ్లమేషన్స్ కలిగే ప్రమాదముంది. దాంతో కాలేయం గట్టిపడిపోవచ్చు. సిర్రోసిస్ వస్తే అపాయం. అది భయపడాల్సిన స్థితి. కాబట్టి కాలేయంలో కొవ్వు పేరుకుపోయి... ఫాటిలివర్‌తో ఎవరైనా వస్తే కాలేయ వైద్య నిపుణులు సంపూర్ణంగా పరీక్షిస్తారు.

కొవ్వు పదార్థాల్ని ఎక్కువగా తీసుకోవడం వల్ల ఫాటి లివర్ వస్తుందనిపించవచ్చు కొందరికి. కానీ వాస్తవానికి కొవ్వు పదార్థాలు అరగడంలో ప్రధానపాత్ర కాలేయానిది. అరుగుదలలో లోపంవల్లే అయినా ఏ కారణాన కాలేయంలో కొవ్వు పేరుకు పోతుందనే విషయం తెలీదు. చాలా పరిస్థితుల్లో కొవ్వు పేరుకుపోవచ్చు. ఊబకాయం... అధిక బరువుండడంవల్ల ఎక్కువగా ఈ స్థితి వస్తుంది. దయాబెటిస్... మధుమేహ వ్యాధిగ్రస్తులలో ఫాటి లివర్ రావచ్చు. అలాగే రక్తంలో ట్రైగ్లిజరైడ్స్ ఎక్కువగా ఉండడం, అధికంగా మద్యాన్ని సేవించడం వల్ల కూడా ఫాటిలివర్ రావచ్చు. కొన్ని రకాల అనారోగ్యాలలో, వాల్‌ప్రొయిక్ యాసిడ్ లాంటి మందులవల్ల, కార్టికోస్టిరాయిడ్స్ వల్లా రావచ్చు. ఒక్కోసారి గర్భం ధరించినపుడు ఈ కాంప్లికేషన్ రావచ్చు.

రోగలక్షణాలు ప్రత్యేకంగా ఏమీ తెలీవు. మామూలు పరీక్షలలో ఫాటి లివర్ సాధారణంగా బయటపడదు. రక్త పరీక్షలో కొన్ని లివర్ ఎంజైమ్స్ ఎక్కువగా కనిపించడంవల్ల, కాలేయ(లివర్) పరిమాణం ఎక్కువవడం వల్ల కనిపెట్టవచ్చు. లోతుగా వైద్యుడు రోగిని ఇతర అనారోగ్యాలను పరీక్షించేప్పుడు కూడా ఇది బయటపడవచ్చు. ఏ అనారోగ్యానికైనా పొట్ట ప్రాంతంలో అల్ట్రాసౌండ్ పరీక్ష చేసేప్పుడు ఫాటిలివ్ ఉందని బయట పడవచ్చు. ఫాటి లివర్ నిర్ధారణకు వైద్యుడు కాలేయంలోంచి చిన్నముక్కని తీసి బయాప్సీ చేయించమని చెప్పవచ్చు. లోకల్ అనస్థీషియా ఇచ్చి, కుడి ఛాతీ, కింది భాగంలోకి సన్నటి సూదిని పంపి కాలేయంలోని అతి చిన్న ముక్కని తీసి మైక్రోస్కోప్ కింద పరీక్షించి ఫాటిలివర్ అయితే పసిగట్టవచ్చు.

హెపటైటిస్ అంటే కాలేయం ఇన్‌ఫ్లేమ్ కావడం! కొవ్వు బాగా చేరడం వల్ల కాలేయానికి వచ్చే ఇన్‌ఫ్లమేషన్‌ని 'స్టీటో హెపటైటిస్' అంటారు.



అతిగా మద్యం సేవించడం వల్ల ఫాటిలివ్ కలిగి ఇన్‌ఫ్లమేషన్ వస్తే దానిని 'ఆల్కహాలిక్ హెపటైటిస్' అంటారు. ఆల్కహాలిక్స్ హెపటైటిస్, స్టీటో హెపటైటిస్ ఒకేలా ఉంటాయి. కాకపోతే మద్యం తీసుకోనివాళ్ళకి కూడా స్టీటో హెపటైటిస్ రావచ్చు. కాకుంటే దీనిని సాధారణంగా 'నాన్ ఆల్కహాలిక్ స్టీటో హెపటైటిస్' లేక **'NASH'** అంటుంటారు.

ఆల్కహాలిక్ హెపటైటిస్, స్టీటో హెపటైటిస్ రెండింటి వల్లా కాలేయం తీవ్రంగా దెబ్బతిని, సిర్రోసిస్ అనే జబ్బు రావచ్చు.

బాగా బరువున్న వాళ్లలో సాధాణంగా స్టీటో హెపటైటిస్ రావచ్చని పరిశోధనల్లో వెల్లడైంది. హఠాత్తుగా ఎక్కువగా బరువు తగ్గిపోయినప్పుడూ ఫాటిలివర్ రావచ్చు. కొందరు ఆడవాళ్ళలో జెన్ హార్మోన్ కారణంగా స్టీటో హెపటైటిస్ రావచ్చు.

ఫాటిలివర్ రావడానికి గల కారణాన్ని తెలుసుకుని, దానిని అదుపులో ఉంచడంతో ఫాటి లివర్‌ని అదుపులో ఉంచవచ్చు. అంటే మధుమేహముంటే అదుపులో ఉంచుకోవాలి. రక్తంలో ట్రైగ్లిజరైడ్స్ ఎక్కువగా ఉంటే చికిత్సతో వాటిని తగ్గించుకోవాలి. మద్యంలాంటి వాటికి దూరంగా ఉండాలి. బాగా లావుగా ఉంటే చిన్నపేగుల బైపాస్ సర్జరీలాంటి శస్త్రచికిత్సలతో బరువు తగ్గడంలో ఫాటిలివర్ని అదుపులో ఉంచుకోవచ్చు.

బరువు తగ్గడం కష్టమైనా ఫాటిలివర్ని తగ్గించుకోవడానికి అదే మార్గం. కాలేయానికి అపాయం జరిగిందనే అనుమానం వస్తే బయాప్సీ చేయించడం అవసరం. బరువు ఎక్కువగా ఉండడంవల్ల రక్తంలో ట్రైగ్లిజరైడ్స్ పెరగవచ్చు. మధుమేహం రావచ్చు. అందుకని అధిక బరువుంటే ముందు దానిని తగ్గించుకోవాలి. స్టీటో హెపటైటిస్ వస్తే బరువు తగ్గడం చాలా అవసరం. బరువు తగ్గడం కష్టం కావచ్చు. కానీ కాలేయానికి సిర్రోసిస్ వస్తే అంతకన్నా కష్టం కదా? పరిస్థితి కాలేయ మార్పిడి దాకా వెళ్ళవచ్చు!

స్టీటో హెపటైటిస్ వస్తే యాక్టిగల్ లాంటి మందులు తగ్గించగలవని ఇటీవలి పరిశోధనలు నిరూపిస్తున్నాయి. వీటన్నింటికన్నా బరువు తగ్గడం తప్పక కావలసిన చికిత్స.

కాలేయం పూర్తిగా దెబ్బతింటే మార్పిడి ఒక్కటే మార్గం.

కాలేయంలో కొవ్వు పెరగడాన్ని ఫాటిలివర్ అంటారు. అంతే కాని కాలేయంలోని కొవ్వువల్ల కాలేయం దెబ్బతినదు. ఫాటిలివర్‌తో కలిసి మరికొన్ని అనారోగ్యాలు కలగవచ్చు. లివర్ కణాలలోకి కొవ్వు పేరుకు పోకుండా ఎలాంటి జాగ్రత్తలు, తీసుకోవాలనే విషయాలమీద ఇంకా పరిశోధనలు జరుగుతున్నాయి. ఫాటిలివర్ రావడానికి కారణాన్ని పసిగట్ట గలిగితే దానికి చికిత్సతో ఫాటిలివర్ని అరికట్టవచ్చు. కాబట్టి లివర్ వైద్యనిష్ణాతుల్ని కలిసి, వాళ్ళిచ్చే సూచనలను పాటించి ఫాటిలివర్ బారి నుంచి మనల్ని మనం కాపాడుకోవచ్చు. ❄

"బడా పెట్టుబడిదారీ వర్గాల ఆధిపత్యంలోని టెలివిజన్‌కు గొప్ప సైద్ధాంతిక సామర్థ్యం వుంటుంది. అది ప్రసారం చేసే భావాలు వీక్షకులకు తెలియకుండానే వారిని శాసించే స్థాయికి చేరుకుంటాయి. ఆర్థిక వ్యవస్థకు అనుగుణంగా సమాంతర భావజాలాన్ని, సాంస్కృతిక పరమైన ప్రచారాన్ని చాపకింద నీరులా వ్యాపింపచేస్తాయి. సమాజంలోని సభ్యులు ఒకే తానులో ముక్కల్లా తయారై వస్తు వినిమయ వ్యామోహానికి లోబడిపోయేందుకు రంగం సిద్ధం చేస్తుంది. పెట్టుబడిదారీ సంబంధాల పెంపుదలకు కావలసిన భౌతిక మానసిక ప్రతీకలను టెలివిజన్ సిద్ధం చేస్తుంది. ప్రజల ధనాన్ని పెట్టుబడిదారులు కొల్లగొట్టినట్టే సమయాన్ని ప్రసార సాధనాలు కబళిస్తాయి. వారిని వారికి కాకుండా చేస్తాయి"

బుల్లితెర వెనక అర్థిక - అమరిక

నిరంతర ప్రసారాలతో ఛానళ్ల విస్తరణ జరిగాక ఎక్కడ చూసినా "టీవీలో చూపించారు" అంటూ మాటలు మొదలవుతుంటాయి. దూరదర్శన్ అనే డీడీ ఒక్కటే వున్నప్పుడు అందులో వచ్చే సీరియళ్లు, కార్యక్రమాలకే పరిమితమైన పరిస్థితి పోయి టీవీ సర్వాంతర్యామిగా తయారై స్పృశించని రంగమంటూ లేకుండా పోయింది. అనుదినం అనుక్షణం కూడా అనేక రకాల కార్యక్రమాలు ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. ఇందులో ఏదో రహస్యం వుందని అందరికీ అనిపిస్తున్నా అంతుబట్టడం కష్టం. అందుకే వాటన్నిటినీ ఎలా అర్థం చేసుకోవాలో చక్కగా చెప్పే చిన్ని పుస్తకం 'మతం-రాజకీయాలు-టీవీ'. అర వింద్ రాజగోపాల్ రాసిన ఈ పుస్తకం తొంభయ్యవ దశకంలో టీవీ అంతగా ఎందుకు విస్తరించిందో, తర్వాతి పరిణామాలను ఎలా ప్రభావితం చేసిందో సోదాహరణంగా వివరిస్తుంది.

వెకిలిగా వెగటుగా వుండే పలు టీవీ కార్యక్రమాల మంచి చెడ్డలు, ఉచితానుచితాల గురించి ఎడతెగని తర్జనభర్జనలు కూడా సాగుతున్నాయి. అయితే అసలు టెలివిజన్ అనే ప్రసార మాధ్యమం స్వరూప స్వభావాలను గమనంలోకి తీసుకుంటే తప్ప ఈ పరిణామాలను అర్థం చేసుకోవడం తేలికవుతుంది. మనకన్నా ముందు టీవీ మాధ్యమం అభివృద్ధి చెందిన పాశ్చాత్య దేశాలలో పరిశీలకులు, విశ్లేషకుల అభిప్రాయాలు అనుభవాలు మన దేశంలోనూ ఎలా పునరావృతమవుతున్నాయో అరవింద్ తెలియజేశారు. ఇదే పేరుతో ఆయన రాసిన గ్రంథం పీఠికను ప్రజాశక్తి బుక్‌హౌస్ 36 పేజీల పుస్తకంగా ప్రచురించింది. బి.భాస్కర్ అనువదించారు. దేశంలో మత మార్కెట్ తత్వాల పెరుగుదలతో టీవీ విస్తరణ అవిభాజ్యంగా ముడిపడి వుండటం సహజ పరిణామమేనని ఎరుక పర్చే అమూల్యమైన అధ్యయనం ఇది. ఈ రెండు శక్తులు కూడా ఒకే మాధ్యమం వల్ల లాభపడటం వెనక స్పష్టమైన తర్కం వుంది.

ఒక ప్రసార మాధ్యమంగా టెలివిజన్ శక్తి సామర్థ్యాలేమిటి? భారత దేశం వంటి దానిపై అది ఎలాంటి ప్రభావం చూపిస్తుంది? అనే పరిశీలనతో పుస్తకం మొదలవుతుంది. "బడా పెట్టుబడిదారీ వర్గాల ఆధిపత్యంలోని టెలివిజన్‌కు గొప్ప సైద్ధాంతిక సామర్థ్యం వుంటుంది. అది ప్రసారం చేసే భావాలు వీక్షకులకు తెలియకుండానే వారిని శాసించే స్థాయికి చేరుకుంటాయి. ఆర్థిక వ్యవస్థకు అనుగుణంగా సమాంతర భావజాలాన్ని సాంస్కృతిక పరమైన ప్రచారాన్ని చాపకింద నీరులా వ్యాపింపచేస్తాయి. సమాజంలోని సభ్యులు ఒకే తానులో ముక్కల్లా తయారై వస్తు వినిమయ వ్యామోహానికి లోబడిపోయేందుకు రంగం సిద్ధం చేస్తుంది. పెట్టుబడిదారీ సంబంధాల పెంపుదలకు కావలసిన భౌతిక మానసిక ప్రతీకలను టెలివిజన్ సిద్ధం చేస్తుంది. ప్రజల ధనాన్ని పెట్టుబడిదారులు కొల్లగొట్టినట్టే సమయాన్ని ప్రసార సాధనాలు కబళిస్తాయి. వారిని వారికి కాకుండా చేస్తాయి" అంటారు ప్రొ॥ టాడ్ గిట్లిన్. ఇది కనిపించని దోపిడీ. అందుకే టెలివిజన్‌కు సాంకేతికంగానూ, సాంస్కృతికంగానూ రెండు ముఖాలు వున్నాయని బ్రిటిష్ వామపక్ష మేధావి రచయిత రేమాండ్ విలియమ్స్ విశ్లేషించాడు. వివిధ కార్యక్రమాల్ని అందిస్తూనే మధ్య మధ్య సమయం సందర్భం లేకుండా వాణిజ్య ప్రకటనల్ని గుప్పిస్తుంది (ఉదాహరణకు చావు వార్తలతో పాటు అందాల సాధనాల అడ్వర్టయిజ్‌మెంట్లు లేదా ప్రోమోలు ఇవ్వొచ్చు). ఇది పూర్తిగా టీవీ అధినేతల ఇష్టాయిష్టాలపైనే ఆధారపడి వుంటుంది. ఆ విధంగా ప్రేక్షకుల సమయాన్ని, దృష్టిని వారికి తెలియకుండా హరించి వ్యాపార ప్రచారానికి వాడుకోవడం జరుగుతుంది. ఒక ప్యాకేజీగా కట్టగట్టి ప్రేక్షకులపై రుద్దుతుంది. ఇందుకు రేటింగులు కూడా వుంటాయి. తమ అభిరుచి ప్రకారమే చూస్తున్నామని భ్రమపడే ప్రేక్షకులు ఈ మాయాజాలాన్ని గుర్తించలేరు.

ఎక్కడెక్కడి సమాచారాన్ని సంఘటనలను వెంటవెంటనే చేరవేసే విధానంలో కొన్ని ప్రేక్షకుల హృదయాలకు హత్తుకు పోతాయి. అయితే పత్రికలలో మాదిరిగా లోతైన విశ్లేషణకు మాత్రం అవకాశం వుండదు. అయినా సరే తాము అన్నీ తెలుసుకుంటున్నామని, అమితమైన స్వేచ్ఛతో భాగస్వాములమవుతున్నామని ప్రేక్షకులు భ్రమలో పడిపోతారని మార్షల్ మాక్ లూహన్ చెబుతారు. పైగా బుల్లితెరపై చూస్తున్న వారు తమకు అత్యంత సన్నిహితులై పోయారని కూడా

అనుభూతి చెందుతారు. నిజానికి సమాచారం అందించినందుకు బదులుగా పుచ్చుకునే బహుమానం చాలా ఖరీదైంది. బహుమతులు పుచ్చుకోవడం గొప్ప విజయంగానూ అనుబంధంగానూ భావించే ప్రేక్షకులు ఆ క్రమంలో తాము కోల్పోతున్నదేమిటో గుర్తించడం అసాధ్యంగా పరిణమిస్తుంది. ఇలాంటి అవగాహనతో భారతీయ ప్రసార సాధనాలను అర్థం చేసుకోవాలంటాడు అరవింద్.

ప్రధానంగా పత్రికలు, చలన చిత్రాలు భారతీయ ప్రసార సాధనాలు ప్రజా బాహుళ్య స్వభావం కలిగి నడిచేవి. రేడియో పూర్తిగా ప్రభుత్వాధీనంలోనే వుండేది. డీడీ పేరుతో దూరదర్శన్ కూడా అలాగే మొదలైంది. అప్పట్లో రామాయణ మహాభారతాలు సుదీర్ఘ ధారావాహికలుగా ప్రసారమైనాయి. అవి హిందూత్వ శక్తులకు వరప్రసాదాలే అయ్యాయి. ఇక్కడ దైవ భావన కూడా టీవీ ప్రచారంలో వస్తు రూపం సంతరించుకోవడం గమనిస్తాం. దాన్నే బిజెపి సొమ్ము చేసుకుంది. అనేక చోట్ల ఆరెస్సెస్ వారు టీవీలకు కొబ్బరికాయలు కొట్టిన ఉదాహరణలున్నాయి. అవే శక్తులు 'తమస్' వంటి సీరియళ్లపై దాడి చేశాయి కూడా. 1992 తర్వాత ఉపగ్రహ ఛానళ్ల రాక ఈ పరిస్థితిని సమూలంగా మార్చేసింది. అంతకు ముందు ప్రభుత్వాధీనంలోనే వున్నప్పటికన్నా ఈ దశలో వాణిజ్య స్వభావం ఇంకా తీవ్ర రూపం దాల్చింది. ఈ ఒకటిన్నర దశాబ్దంలోనూ టీవీ ఛానళ్లు వ్యాపార ప్రధానమైనవనే విషయం నిస్సందేహంగా రుజువైంది. అందులోనూ మన వంటి సంప్రదాయిక సమాజాలలో పాతుకు పోయిన విలువలను మొదలంటా కదిలించి ఒక విధమైన కుహనా ఆధునికతను కూడా ప్రవేశపెట్టింది. ఇదే టీవీ ద్విముఖ స్వభావానికి దాఖలా అంటూ విదేశాలలో జరిగిన వివిధ అధ్యయనాలను ప్రస్తావించారు.

ఇక టీవీ అనంతర రాజకీయాల చర్చలో దాని ప్రభావాన్ని ఏక పక్షంగా అంచనా వేయలేమంటారు అరవింద్. అదొక వైరుధ్యాల పుట్ట అంటారు.. దానికి భిన్నమైన అర్థాలుంటాయి. ఎలక్ట్రానిక్ పెట్టుబడిదారీ యుగంలో విభజిత సమాజం తీరుతెన్నులను పరిశీలించాలని చెబుతారు. మీడియా సందేశాన్ని వివిధ సామాజిక తరగతుల ప్రేక్షకులు కూడా వైవిధ్య భరితంగానే అన్వయించుకుంటారు. ఉదాహరణకు పురాణ ప్రసారాల పరంపరతో మన గత చరిత్ర ఘనమైనదనే పాక్షిక భావన ప్రజల్లో పెద్ద ఎత్తున చొప్పించబడింది. దాంతోపాటే 'ఆధునిక వస్తు సంచయం సమకూర్చుకోవడమే గొప్ప' అన్న భావనా ప్రబలింది. అందుకే హిందూ జాతీయ వాదం కొత్త అభిమానులకు రిటైల్ హిందూత్వాన్ని అనేక వినియోగ భావనలతో అందించిందని అరవింద్ సూత్రీకరిస్తారు. బిజెపి అధికారంలోకి వచ్చి 1998 మే 13న అణుబాంబు పరీక్ష జరపడంతో ఈ కుహనా జాతీయ వాదం పరాకాష్టకు చేరింది. అది వరలో మన జాతీయత అంటే పాశ్చాత్య పలస వాదాన్ని ప్రతిఘటించడం అనే భావన వుంటే ఇప్పుడది మారిపోయింది. జాతీయ వాదాన్ని కీర్తించుకుంటూనే స రళీకరణ జ్వరంలో పాశ్చాత్య సంపర్కం కోసం పాకులాడటం పరిపాటి అయింది. ఈ మార్పును తీసుకురావడంలో టీవీ మాధ్యమం కీలక పాత్ర నిర్వహించిందని, నిజానికి ఎక్కడైనా అది అలాంటి పాత్రనే పోషిస్తుందని రచయిత అభిప్రాయం. కొద్ది పేజీలలోనే అవసరమైన గొప్ప విశ్లేషణను అందించిన ఈ పుస్తకం ప్రజా జీవితంతో సంబంధమున్నవారంతా పఠించదగింది.

మతం - రాజకీయాలు - టీవీ
అరవింద్ రాజగోపాల్, అనువాదం : బి.భాస్కర్
వెల:8/-, పేజీలు: 36
ప్రతులకు: ప్రజాశక్తి బుక్‌హౌస్, చిక్కడపల్లి, హైదరాబాద్.

❄









సీరియల్

మూలం : బరీ మై హార్ట్ ఎట్ ఉూండెడ్ నీ (డీ బ్రౌన్)

తెలుగు సేత: ముక్తవరం పార్థసారథి

జరిగిన కథ:

అపాచీ నేల మీద బలవంతపు శాంతి రాజ్యమేలింది. ఇండియన్లను, క్రూరజంతువుల్లా కాక, మనుషులుగా గుర్తించిన కొద్దిమంది తెల్ల అధికారులు అతికష్టం మీద ఒడంబడికలను అమలు చేస్తున్నారు. టాం జెఫోర్డ్స్, జాన్‌క్లమ్ లిద్దరూ అపాచీలకు మిత్రులు. కాని, తాము సాధించగలిగింది చాలా తక్కువేనని వాళ్లకు తెలుసు. ఇండియన్లను సమర్థించిన తెల్లవాళ్లకు ప్రభుత్వ ఉద్యోగాల్లో భవిష్యత్తు లేదని ఆ ఇద్దరూ అనుభవ పూర్వకంగా గ్రహించారు.

అమెరికన్ డేగ

(35వ భాగం)

ఒంటరినే. కాని నా జాతి జనుల గళం నేను. వాళ్ల హృదయఘోష నా భాష... యుద్ధం నాకు వద్దు. మనిషిలా తలెత్తుకుని తిరగాలన్నదే నా ఆశయం. తెల్లవాళ్ళకున్న హక్కులు మాకెందుకు లేవు? నా చర్మం ఎరుపైనా, మా ఇద్దరి హృదయాలూ ఒకలాగే కొట్టుకోవా? చావంటే భయంలేదు. నేను నేలకూలడమే జరిగితే నా శత్రువుల శవాల మీదే పడతాను. లాస్ట్ రివర్ వద్ద నేను నిద్రిస్తున్నప్పుడు మీ సైనికులు దాడి చేశారు. ఇదిగో గాయపడిన లేడిలా ఇక్కడికి పరుగెత్తుకొచ్చాను...

తెల్లవాళ్ళు ఇక్కడికి రావద్దని మేమెప్పుడూ ఆంక్షలు పెట్టలేదు. నాకూ, కెప్టెన్ జాన్‌కు ఈ నేల మీద హక్కుందని చెప్పారు. మీరు ఎప్పుడూ ఏ ఇబ్బందీ కలిగించలేదు. మీ వద్ద కొనుక్కున్న వస్తువులకు ధర చెల్లించాం గదా. మీ లాగే మేమూ స్వేచ్ఛగా బతకాలనుకుంటున్నాం. వేట జంతువులే ఆహారంగా, సుఖశాంతులతో, మా జాతి వాళ్ళిక్కడ వర్ధిల్లాలి.

-"మాడాక్స్" నాయకుడు కింట్పాష్ (కెప్టెన్ జాక్)

కాలిఫోర్నియా ఇండియన్లు అక్కడి వాతావరణం లాగే సౌమ్యులు. స్పేనియార్డులు వచ్చి, వాళ్లకు తమ పేర్లు పెట్టి, (క్రిస్టియన్) మిషన్లు ఏర్పాటు చేసి ఆ అమాయకుల సంస్కృతీ సాంప్రదాయాలను నాశనం చేశారు. ఇక్కడి ఇండియన్లకు యుద్ధానుభవం ఎక్కువగా లేకపోవటం వల్ల, ప్రతి గ్రామానికీ ఒక నాయకుడున్నప్పటికీ, "వార్ ఛీఫ్"లను ఎన్నుకోలేదు. 1848లో కాలిఫోర్నియాలో బంగారం దొరుకుతుందని తెలిసి వేలాదిగా తెల్లవాళ్ళు ఈ ప్రాంతాన్ని ఆక్రమించుకున్నారు. అమాయకులైన ఇక్కడి ఆదివాసులను వధించి, లేదా లొంగదీసుకుని భీభత్సం, సృష్టించారు. ఒకప్పుడక్కడ వున్న వందలాది తెగలిప్పుడు పేరుకైనా కానరావు. చిలులా, చిమారికో, ఉరెబురె, నైపెపై, అలోనా లేదా మరో వంద తెగలకు చెందిన ఇండియన్ల అస్తికలు ఇక్కడి ఎక్స్‌ప్రెస్ హైవేల కింద, పార్కింగ్ లాట్స్ కింద, భవ్యహార్మ్యాల కింద నిక్షిప్తమై పోలేదా!

కాలిఫోర్నియా ఇండియన్లు తమ హంతకుల్ని ప్రతిఘటించలేదు గాని "మాడాక్స్" తెగవారు మాత్రం ఇందుకు మినహాయింపు. ఆరెగాన్ సరిహద్దులో టూలె సరస్సు వద్ద స్థిరనివాసం, ఏర్పర్చుకున్న వీళ్ళకు ప్రతికూల వాతావరణ పరిస్థితులతో నిత్యం సమరమే. 1850ల దాకా 'మాడాక్స్'కు తెల్లవాళ్ళతో సంపర్కమే లేదు. ఆ తర్వాత గుంపులు గుంపులుగా వచ్చిన యూరోపియన్లు అక్కడి ఇతర ఇండియన్ల లాగే వీళ్లూ తన ఆధిపత్యాన్ని అంగీకరిస్తారని ఆశించారు. చిన్న చిన్న ఘర్షణలతో ప్రారంభమైన ప్రతిఘటన పూర్తి స్థాయి యుద్ధం దాకా కొనసాగింది.

'మాడాక్' తెగకు చెందిన యువకుడు 'కింట్‌పాష్'కు జనం ఎందుకిలా ఒకర్నొకరు చంపుకుంటున్నారో అర్థం కాలేదు. అందరూ కలసి బతికితే వచ్చిన యిబ్బందేమిటి? టూలె లేక్ ప్రాంతం విశాలమైంది. అందరికీ సరిపడినన్ని లేళ్ళు, దుప్పులు, బాతులు, చేపలు కామాస్ దుంపలు వున్నాయక్కడ. యుద్ధం చేస్తున్నందుకు తన తండ్రి మీద కోపం కూడా వచ్చింది. తెల్లవాళ్ళు నమ్మకద్రోహులనీ, వాళ్లను తరిమెయ్యక పోతే తమ మనుగడకే ముప్పు వస్తుందని చెప్పిన కొద్ది రోజులకే అతడు సైనికుల చేతుల్లో హతుడయ్యాడు. కొత్త నాయకుడిగా కింట్‌పాష్ బాధ్యతలు చేపట్టక తప్పలేదు. ఆ తర్వాత, కొన్నాళ్ళు శాంతికోసమే అన్ని ప్రయత్నాలూ చేశాడు. నమ్మకస్తులనుకున్న తెల్లవాళ్లతో మంతనాలు జరిపాడు. ఇరేకా వద్ద వ్యాపారం (వస్తు మార్పిడి) చేసుకోవటానికి ఒప్పందం కూడా కుదిరింది.

"తెల్లవాళ్ళంటే నాకిష్టమే. వస్తామని అంటే నేను స్వయంగా వాళ్లను ఆహ్వానించాను. ఈ నేల అందరిదీ. మాతో పాటే వాళ్లూ బతకనీ" అన్నాడు. కింట్‌పాష్‌కు తెల్లవాళ్లంటే మోజెక్కువ. వాళ్ల దుస్తులు, ఇళ్ళు, బళ్ళు పశువుల మందలు అన్నీ అతణ్ణి ఆకర్షించాయి.

ఇరెకా వద్ద స్థిరపడ్డ తెల్లవాళ్ళు, ఇండియన్లకు ఇంగ్లీషు పేర్లు పెట్టుకున్నారు. కింట్‌పాష్‌ను కెప్టెన్ జాక్ అన్నారు. అలాగే యితర్లను హుకర్‌జిం, స్టీంబోట్ ఫ్రాంక్, స్కార్ ఫేస్డ్ చార్లీ, బాస్టన్ చార్లీ, కర్లీ హెడెడ్ డాక్టర్, షాక్ నాస్టీ జిం, షాంచిన్ జాన్, ఎల్లెన్స్‌మాన్ వగైరా పేర్లతో పిలిచారు.

సివిల్ వార్ సమయంలో తెల్లవాళ్లకూ, మాడాక్స్‌కూ మధ్య ఘర్షణలు ప్రారంభమైనాయి. వేట జంతువులు దొరకనపుడు, తెల్లవాళ్ళు పెంచుకున్న దున్నల్ని చంపి తిన్నారు ఇండియన్లు. అలాగే, తమ గుర్రాలు లేనప్పుడు వీళ్ళ గుర్రాల మీద స్వారీ చేశారు. ఇదంతా, తెల్లవాళ్ళు తమకు కట్టవలసిన 'శిస్తు'లో భాగం అనుకున్నారు. కోపగించిన సెట్లర్లు, మాడాన్స్‌ను టూలె లేక్ ప్రాంతాల నుండి తొలగించాలని తమ రాజకీయ ప్రతినిధుల మీద వత్తిడి తెచ్చారు.

ఆ తర్వాత, కొద్ది రోజుల్లోనే, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ట్రీటీ కమిషన్ తన ప్రతిపాదనలను కెప్టెన్ జాక్‌కు తెలియజేసింది. మాడాక్ తెగవాళ్ళు, టూలె ప్రాంతం వదిలి, ఆరెగాన్ వద్ద నెలకొల్పిన రిజర్వేషన్‌కు స్వచ్ఛందంగా వెళ్ళిపోతే, ఒక్కొక్క

కుటుంబానికీ అవసరమైన భూమి, గుర్రాల జతలు, బళ్ళు, వ్యవసాయ పరికరాలు, దుస్తులు, భోజనం వగైరా సదుపాయాలన్నీ ప్రభుత్వం సమకూరుస్తుంది. టూలె దగ్గరే తనకు భూమి కావాలని డిమాండ్ చేశాడు కెప్టెన్ జాన్. కమిషనర్లందుకు నిరాకరించారు. చేసేది లేక, అనివార్యంగా, అగ్రిమెంట్ మీద సంతకం చేశాడు కెప్టెన్ జాన్. ఫలితంగా, మాడాక్స్, క్లామాత్ రిజర్వేషన్‌కు వెళ్ళక తప్పలేదు. అయితే అప్పటికే అక్కడ ఉంటున్న క్లామాత్ ఇండియన్లు ఆగంతకులను శత్రువుల్లా చూశారు. మాడాన్స్ తమకు కేటాయించిన భూములకు కంచె ఏర్పాటు చేసుకోవాలని ప్రయత్నించినప్పుడు కలప దుంగల్ని దొంగిలించుకు పోయారు స్థానికులు. ప్రభుత్వం చేసిన ఇతర వాగ్దానాలేవీ కార్యరూపం దాల్చలేదు. రిజర్వేషన్ అధికారి, క్లామాత్‌లకు మాత్రమే భోజనం, దుస్తులు సప్లై చేశాడు (ఈ అదనపు ఖర్చు కోసం వాషింగ్టన్‌లో బడ్జెట్ కేటాయింపు జరగలేదు).

తన అనుచరుల దీనావస్థకు చలించిన కెప్టెన్ జాన్ రిజర్వేషన్ వదిలి వెళ్లటానికే నిశ్చయించుకున్నాడు. లాస్ట్ రివర్ వాలీకి చేరుకుంటే కావలసినంత వేట, చేపలు, కామాస్ దుంపలు తమ ఆకలి తీరుస్తాయి. కాని మాడాక్స్ అక్కడికి రావటం తెల్లవాళ్లకిష్టం లేదు. వీళ్ళ మీద తరచుగా ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. ఎవరి జోలికీ వెళ్ళవద్దని కెప్టెన్ ఎన్నిసార్లు హెచ్చరించినా, మూడు వందల మంది ఇండియన్లు అంత క్రమశిక్షణతో మెలగటం అసాధ్యం. వేటకో మరేదో పనిమీదో బయల్దేరినప్పుడు తెల్లవాళ్ళ కంట పడకుండా ఎలా ఉండగలరు? తన వాళ్ళందర్నీ క్లామాత్ రిజర్వేషన్‌కు తీసుకువెళ్ళాలని కెప్టెన్ జాన్‌కు ఇండియన్ బ్యూరో నుండి ఆదేశం వచ్చింది. క్లామాత్‌లు కూడా తమను రానివ్వటం లేదు గనక, లాస్ట్ రివర్ వద్దే మాడాక్స్ కోసం ఒక రిజర్వేషన్ ఏర్పాటు చెయ్యమని అర్థించాడతడు. ఇండియన్ బ్యూరోకు ఈ ప్రతిపాదన నచ్చినప్పటికీ, పశువుల పెంపకంతో లాభాలార్జిస్తున్న తెల్ల రాంచర్లు వ్యతిరేకించారు. ఇండియన్లు క్లామాత్‌కు వెళ్లక తప్పదని, 1872లో ఆకురాలు కాలంలో, ప్రభుత్వం ఆదేశం జారీ చేసింది. జాక్ నిరాకరించాడు. సైన్యంతో బలవంతంగా మాడాక్స్‌ను తరలించటానికి ప్రయత్నించింది ప్రభుత్వం. 1872 నవంబర్ 28 నాడు, తెరిపి లేక కురుస్తున్న మంచు వర్షంలో ఫస్ట్ కెవల్రీ (అశ్వికదళం)కి చెందిన ముప్పై ఎనిమిది మంది సైనికులతో జేమ్స్ జాక్సన్ (ఇండియన్లను తేవటానికి) దక్షిణంగా లాస్ట్ రివర్ వైపు కదిలాడు.

సూర్యోదయానికి ముందే అశ్వికులు మాడాక్ క్యాంప్ చేరుకున్నారు. గుర్రాలు దిగి, తుపాకులు చేతపట్టుకుని ఇండియన్ గుడారాల దిశగా అడుగులు వేశారు. స్కార్‌ఫేస్డ్ చార్లీ, ఇతరులు ఆయుధాలతో వీళ్లనెదిరించారు. ప్రభుత్వ ఆజ్ఞల్ని అమలు పరచటానికే వచ్చామని జాన్‌తో మర్యాదగా చెప్పాడు మేజర్.

"పిరికి పందల్లా చీకట్లో వచ్చారెందుకు? మీ తెల్లజాతి మీదే నాకు నమ్మకం లేదు. మిమ్మల్ని చూస్తేనే మావాళ్ళు భయపడు తున్నారు. మీరు పట్టుకు పోవటానికి మేం దొంగలం కాము. ప్రభుత్వం ఆజ్ఞాపిస్తే వెళ్లక తప్పదని మాకు తెలుసు" అన్నాడు జాన్.

కెప్టెన్ జాక్

లెఫ్టినెంట్ బూటెల్‌ను "డిసార్మ్ హిం" అంటూ ఆజ్ఞాపించాడు మేజర్.

"ఇవ్వరా", అంటూ అరిచాడు లెఫ్టినెంట్.

స్కార్ ఫేస్డ్ చార్లీ బిగ్గరగా నవ్వుతూ, నేనేమైనా కుక్కనా ? ఎందుకూ గొంతు చించుకుంటావు?" అంటూ పరిహసించాడు.

బూటెల్ తన పిస్టల్ చార్లీకి గురి పెట్టి "మాకే ఎదురు చెబుతావా?" అంటూ హూంకరించాడు!

అతడెందుకు అరుస్తున్నాడో చార్లీ కింకా అర్థం కాలేదు. మర్యాదగా అడగొచ్చుగదా. ఇవ్వను గాక ఇవ్వనన్నాడు.

రెచ్చిపోయిన బూటెల్ కాల్చినప్పుడే, చార్లీ కూడా తన రివాల్వర్ ఫైర్ చేశాడు.

"మా వల్ల మీకేమీ ఇబ్బంది కలగదు" అని నమ్మించి, జాన్‌ను తన అనుచరులతో ఎదురుగా నిలబడమన్నాడు. ఆ తర్వాత, ఆయుధాలు కింద పడేయ్యమని ఆదేశించాడు.

"ఎందుకు" అంటూ అడిగాడు జాన్ ఆశ్చర్యంగా.

"నువ్వు వీళ్ళ నాయకుడివి. మొదట నువ్వు కింద పడేస్తే, నీ అనుచరులూ నిన్ను అనుసరిస్తారు. నా మాట వినలేదో, తరువాత పరిణామాలకు నా బాధ్యత ఉండదు" అన్నాడు జాక్సన్.

"ఇంత వరకు మేం మీతో యుద్ధం కూడా చెయ్యలేదే? ఆయుధాలెందుకు వదులుకోవాలి?" అంటూ ప్రశ్నించాడు జాన్.

అది తన ఆజ్ఞ అన్నాడు మేజర్.

అయిష్టంగా, అనివార్యంగా అందరూ రైఫిళ్ళు కింద పెట్టారు. స్కార్ ఫేస్డ్ చార్లీ పిస్టల్ మాత్రం దగ్గరుంచుకున్నాడు.

అది కూడా ఇవ్వాల్సిందన్నాడు మేజర్.

లెఫ్టినెంట్ బూటెల్‌ను "డిసార్మ్ హిం" అంటూ ఆజ్ఞాపించాడు మేజర్.

"ఇవ్వరా", అంటూ అరిచాడు లెఫ్టినెంట్.

స్కార్ ఫేస్డ్ చార్లీ బిగ్గరగా నవ్వుతూ, నేనేమైనా కుక్కనా ? ఎందుకూ గొంతు చించుకుంటావు?" అంటూ పరిహసించాడు.

బూటెల్ తన పిస్టల్ చార్లీకి గురి పెట్టి "మాకే ఎదురు చెబుతావా?" అంటూ హూంకరించాడు!

అతడెందుకు అరుస్తున్నాడో చార్లీ కింకా అర్థం కాలేదు. మర్యాదగా అడగొచ్చుగదా. ఇవ్వను గాక ఇవ్వనన్నాడు.

రెచ్చిపోయిన బూటెల్ కాల్చినప్పుడే, చార్లీ కూడా తన రివాల్వర్ ఫైర్ చేశాడు.

బూటెల్‌కు భుజంలో తగిలింది గుండు. చార్లీ తప్పించుకొని, కింద పడేసిన రైఫిల్ అందుకున్నాడు. ఇది చూసి మిగిలిన మాడాక్స్ కూడా ఆయుధాలు తీసుకున్నారు. కెవల్రీ కమాండర్ "ఓపెన్ ఫైర్!" అంటూ అరిచాడు. కొన్ని క్షణాల ఇరువైపుల తుపాకులూ గుళ్ళు కురిపించాయి.

సైనికులు నెమ్మదిగా వెనక్కు తగ్గారు (ఒకడు మరణించాడు. ఏడుగురు గాయపడ్డారు).

మాడాక్ స్త్రీలు, పిల్లలూ నెమ్మదిగా టూలె లేక్ వైపు కదిలారు. సైనికుల కంటపడకుండా చెట్లు, పొదల మాటున దాగుతూ మాడాక్‌ల జన్మస్థలం కాలిఫోర్నియా లావా బెడ్స్ వైపు కదిలారు కెప్టెన్ జాక్, అతని యోధులు.

తగలబడిన అరణ్యాలతో ఏర్పడిన శిలలే లావా బెడ్స్. అక్కడి గుహలు కొన్ని వందల అడుగుల లోతున్నాయి. కెప్టెన్ జాక్ తన కోసం ఎంచుకున్న గుహ ఒక సొరంగం లాగుంది. లోపల, ఇరుపక్కలా చిన్న చిన్న గుహలతో లావాతో ఏర్పడిన రహస్య లోకం లాగుంది. అవసరమైతే తాము సైనికులనెదిరించగలమని జాన్‌కు తెలుసు. కాని యుద్ధమెందుకు? పోరాటమన్న తర్వాత ఇరువైపులా ఎంతో కొంత నష్టముండక పోదు! అంతకన్నా, వాళ్లతో ఘర్షణ నివారించి ప్రశాంతంగా బతకటమే తన జాతికి అభిలషణీయం. కనీసం ఈ రాళ్ళు రప్పల్లో తమను వాళ్ళు వదిలేసినా ఇక్కడితో ఈ సమస్య ముగిసినట్టే.

మేజర్ జాక్సన్ సైనికులు వెంటాడుతూ వచ్చినప్పుడు కెప్టెన్ జాక్స్ అను చరులు (హుకర్ జింతో సహా) లాస్ట్‌రివర్‌కు దగ్గరి క్యాంప్‌లో వున్నారు. తెల్లవారుజామున, లావా బెడ్స్‌వైపుగా వస్తున్నప్పుడు జాన్‌కు తుపాకుల మోత వినిపించింది. స్వభావరీత్యా అతడు యుద్ధానికి విముఖుడు. 'సైనికులు మా స్త్రీలను, పిల్లల్ని కాల్చారు. వెను తిరిగి కాల్పులు జరపదలచుకోలేదు" అని తరువాత వాంగ్మూలమిచ్చాడు జాన్.

ఇంకా వుంది....

మనసా... తెలుసా?

హిప్నో కమలాకర్

9390044031

చెడు ఆలోచనలతో చచ్చిపోతున్నా...

నేను ఒక మానసిక సమస్యతో బాధపడుతున్నాను. సుమారు నాలుగు నెలల నుంచి విపరీతమైన చెడు ఆలోచనలు వస్తున్నాయి. అవి ఏమిటి అంటే తల్లిని అవమానించడం, తల్లిని తిట్టడం. ఆఖరికి భగవంతుడు దగ్గరికి వెళ్ళి దండం పెట్టుకునేటప్పుడు కూడా అదే సమస్య. వారిని నా మనసులో కొలిచేటప్పుడు కాలితో తన్నడం, వారి భార్యలనూ తిట్టడం, అవమానించడం... వేటి మీదా ఆసక్తిలేకపోవడం. నామీద నాకే అసహ్యంగా వుంది. దయచేసి నాకు సలహా ఇవ్వవలసిందిగా కోరుతున్నాను.

కృష్ణ, విశాఖపట్నం.

మీ సమస్యను 'అబ్సెసివ్ - కంపల్సివ్ న్యూరోసిస్' అంటారు. క్రమశిక్షణ, చాదస్తంగా జీవితం గడిపే వాళ్లలోనే ఈ రుగ్మత లక్షణాలు ఎక్కువ. తమ మనస్సుకు వ్యతిరేకంగా వద్దనుకున్న, అనవసరమైన చెడు ఆలోచనలు రావటంవల్ల మానసిక ఒత్తిడి ఎక్కువైనప్పుడల్లా అబ్సెషన్స్ పెరిగిపోతుంటాయి. కొంత మందిలో ఈ ఆలోచనలు నిరవధికంగా సాగితే, మరి కొంత మందిలో ఈ ఆలోచనలు కొన్నాళ్ల పాటు కొనసాగి మరి కొన్నాళ్ళు ఆగి తర్వాత మళ్లీ మొదలవుతాయి. గ్యాప్ వచ్చిన రోజుల్లో అంతా బాగానే ఉంటుంది. ఈ సమస్య వల్ల ఎంతో నరకయాతనకు గురవుతారు. ఇది మానసిక రుగ్మత అని గుర్తించరు. ఈ రుగ్మతల నివారణకు 'బిహేవియర్ థెరపీ', 'ఎవ్లర్సింగ్ కండిషనింగ్' వంటి ప్రక్రియలు ఉపయోగపడతాయి. వీటితో పాటు సైకో థెరపీ, ఫ్యామిలీ థెరపీ, ఇన్‌సైట్ ఓరియంటెడ్ థెరపీలను సైకియాట్రిస్ట్ పర్యవేక్షణలో చేయించుకోండి.

ఎత్తు పెరగాలంటే ఎలా!

నా వయస్సు 14 సంవత్సరాలు. నా ఫ్రెండ్స్ అందరూ నన్ను పొట్టివాడినని ఎగతాళి చేస్తుంటారు. నేను పొట్టివాడిగానే ఉండాలా? ఎత్తు పెరగాలంటే ఏం చేయాలి? పొట్టి కారణంగా నలుగురిలో ఫ్రీగా ఉండలేకపోతున్నాను. ఏం చేయాలో సలహా చెప్పగలరు?

రాజేందర్, వనస్థలిపురం.

మీరు ఎత్తు ఎదగడానికి ఇంకా అవకాశం ఉంది. 20 ఏళ్ళ వరకూ ఎత్తు పెరుగుతారు. కాబట్టి ఆందోళన చెందకండి. నలుగురిలోకి వెళ్లినప్పుడు పొట్టితనం అడ్డు రాకుండా అందంగా కనిపించడానికి డ్రెస్ విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోండి.

చాటుమాటు వ్యవహారం వద్దంటే వినదే

మా బంధువుల్లో ఒకామెకు కొంత కాలం క్రితం పెళ్ళైంది. పిల్లలు కూడా వున్నారు. అయితే ఆమె పెళ్ళికాక ముందు తాను ప్రేమించిన వ్యక్తితో ఇప్పుడు సంబంధం పెట్టుకొని చాటుమాటు వ్యవహారం నడుపుతోంది. ఎంత చెప్పినా వినడం లేదు. ఆమె పరిస్థితిలో మార్పు వస్తుందా?

సరిత, హైదరాబాద్.

కొంత మంది వ్యక్తులు ఆడయినా, మగయినా తమ స్వార్థం చూసుకుంటూ కుటుంబాన్ని-సమాజాన్ని లెక్క చేయరు. ఆర్థికంగా, సామాజికంగా సమస్యలనెదుర్కొంటారు. ఎవరి మాటా వినరు. మీ బంధువు కూడా తన కుటుంబానికి దూరం కాలేక గతంలో ప్రేమించిన వ్యక్తినీ వదులుకోలేక ఎటూ తేల్చుకోలేకపోతోంది. ఇలాంటి పరిస్థితి కొనసాగితే, భవిష్యత్తులో ఏవైనా సమస్యలు వస్తే ఆమె అటు భర్త, పిల్లలకు, ఇటు ప్రేమించిన వ్యక్తికి కూడా దూరం కావచ్చు. అలాంటి పరిస్థితి రాకుండా వుండాలంటే వెంటనే కౌన్సిలింగ్ చేయించాలి. అప్పుడే సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

చందు

ప్రజా కవి
అందెశ్రీ
అనుభవాల మాలిక...

ఆకలిని ఎలా జయించాలో నేర్పారు

మల్లారెడ్డి చెప్పిన కథలు ఆకలిని జయించేలా చేశాయి. హరిశ్చంద్రుడు అన్ని కష్టాలు ఎలా అనుభవించాడు? రాముడు రాచరిక ధర్మాలను వదిలి అడవికి వెళ్ళిన వైనం, సిద్ధార్థుడు చక్రవర్తి తనాన్నే వదిలేసి, ప్రపంచానికి జ్ఞానభిక్ష పెట్టిన విధానం... ఆకలిని జయించేలా తీర్చిదిద్దాయి. మల్లారెడ్డి ద్వారా అబ్బిన ఆధ్యాత్మిక జీవనం చిన్నప్పటి నుంచీ పడుతున్న అవమానాలను జయించడానికి అత్యున్నతంగా ఉపయోగపడింది. పురాణాలు, ఇతిహాసాలు విన్నప్పుడు... అవమానాలు, బాధలు మర్చిపోతున్నాం కదా! చదువుకుంటే ఇంకా బాగుంటుంది కదా.. అనిపించేది.

మునీర్ సేట్ సంఘంలో ఎలా గెలవాలో నేర్పాడు. 'అరె అవులే... చిన్న పిల్లగాడివి. చాగబారిన బట్టలు కడతావురా? ఇంట్లో కుండలు కొట్లాడినా... తెడ్లు సలాం చేసినా... రోడ్డు మీదకి వస్తే రాజసంగా ఉండాలి బిడ్డా... లేకపోతే ఈ సమాజం నిన్ను గౌరవించదురా.... ఈ చిరుగుడు బట్టలు, చింపుల పీలికలు కట్టుకుంటే... ఈ సమాజం ఇప్పుడే కాదు, నువ్వు బతికినంతకాలం ఛీ కొడుతూనే ఉంటుంది రా... నిన్ను దగ్గరికి రానీయదు. బట్టలు నల్లగా మాసిపోతే ఈ నరలోకం గౌరవించదు బిడ్డా...' అని బతుకంతా మర్చిపోలేనంత పాఠం నేర్పాడు. కొత్త బట్టలు కుట్టించాడు. జీవితంలో తొలిసారి కొత్త బట్టలు తొడుక్కున్న జ్ఞాపకం అది.

అన్నం పెట్టిన, సాయం చేసిన చేతిని మర్చిపోవద్దు

నేనిద్దరికి జీవితాంతం రుణపడి ఉంటాను. ఆకలిని ఎలా జయించాలో చెప్పిన మల్లారెడ్డికి, సంఘంలో ఎలా గెలవాలో నేర్పిన మునీర్ సేట్ (మహ్మద్ మునీరుద్దీన్)కి. వీరిద్దరి దగ్గరా జీతానికున్నాను.

మా అయ్య చెప్పిన ఓ మాట భగవద్గీత కంటే చాలా గొప్పగా అనిపించింది. 'సద్ది తిన్న రేవు తలవాలి బిడ్డా... చచ్చేదాకా అన్నం పుడతది రా' అని మా అయ్య అనేవారు. అన్నం పెట్టిన, సాయం చేసిన చేతిని ఎప్పుడూ మర్చిపోవద్దన్నది దీని అర్థం.

ఆ గొడవ నాకు లేదు

నేను. అంటరానితనాన్ని అనుభవించ లేదు. కులం బారిన పడ్డారా? అని మా తాత, ముత్తాతలను అడిగినాను. పడలేదన్నారు. దూరంగా ఉంచే పద్ధతిని మా ఊళ్లో గమనించలేదు. అంతా వరుసలు కలుపుకుని సహ జీవనం చేసేవాళ్ళం. కుల రక్కసి మా ఊరి మీద పని చేయలేదు. కాబట్టి ఆ గొడవ నాకు లేదు.

పుట్టెడు కష్టాల నుంచి ఒడ్డుకు చేర్చింది. ఇంట్లో వండే దిక్కులేక బాల్య వివాహం చేశారు. ఓ రోజు కాలు మీద గడ్డ పార పడింది. ఆ ప్రదేశంలో చేయేస్తే ఇప్పటికీ నెప్పిగానే ఉంటుంది. ఆర్నెల్ల పాటు నడవలేకపోయాను. నేల మీద దేకేవాణ్ణి. టి.టి ఇంజెక్షన్ చేయించుకోడానికి ఏకాన్ (ఆరు) పైసలు కూడా లేవు. ఆ సమయంలో నా భార్య పనికెళ్ళి రోజుకు రూపాయిన్నర సంపాదించి నాకన్నం పెట్టింది. భార్యగా కాకుండా అమ్మగా చూసింది. స్త్రీ పట్ల ఎనలేని గౌరవం నా భార్య వల్ల కలిగింది. చిన్నప్పటి నుంచీ కన్నవాళ్ళు నన్ను పట్టించుకున్న పాపాన పోలేదు. 'నా' అన్న వాళ్ళు నన్నాదరించిన ఆనవాళ్ళు లేవు. పుట్టెడు కష్టాల నుంచి ఒడ్డుకు చేర్చింది నా భార్య. పుండు మానిన తర్వాత... ఈ జీతగాడి బతుకు ఇంకా ఎన్నేళ్ళు? అని తన అమ్మగారి ఇంటి నుంచి 150 రూపాయలు తెచ్చి, మునీర్ సేట్‌కు ఇవ్వాల్సిన బాకీ చెల్లించి జీతగాడి జీవితం నుంచి మొదటిసారి విముక్తుణ్ణి చేసింది. నేనీ స్థాయిలో ఉన్నానంటే, ఆ గొప్పతనమంతా నా ఇల్లాలిదే. బతుకంతా ఆమెకు రుణపడి ఉంటాను.

కష్టాలు మార్గాన్ని నిర్దేశించాయి. ఉప్పర పనికి నిజామాబాద్ వెళ్ళాను. సిమెంట్ పని కావడంతో చేతికి బొక్కలు పడ్డాయి. నరకం కనిపించింది. ఇనుప కడ్డీని సమ్మెటతో కొట్టకపోతే వస్తువుగా మారదు కదా! కాబట్టి ఎవరికైనా కష్టాలనే కొలిమిలో కాలకుండా కమనీయ జీవిత విలువలు తెలీవు. అందులో కాలడం వల్లే అందెశ్రీగా పునర్జీవనాన్ని పొందాను. కష్టాలు గొప్ప మార్గాన్ని నిర్దేశించాయి.

శంకర్ మహారాజ్ అనే సాధుపుంగవుని పరిచయంతో నా జీవితం మహోన్నత మలుపు తిరిగింది. నా కవితా గమనానికి శ్రీకారమైంది. ఆయన నాలో ఏం చూశారో! తెలీదుగానీ... 'ఏమిరా... అమ్మ (సరస్వతి) నీ ఆపాదమస్తకం ఉంది. ఎంగిలి పాటలు ఎందుకు పాడతావురా? కవిత్వం కైగట్టు బిడ్డా... గొప్ప కవి అవుతావురా... నీకు మంచి భవిష్యత్తు ఉందిరా...' అని నా జీవితాన్ని నిర్దేశించారు. నా జీవితంలో మరిచిపోలేని సంఘటన ఆయన ఆశ్రమంలో చోటుచేసుకుంది. శివరాత్రి పర్వదినాన మహోన్నత యజ్ఞాన్ని నిర్వహిస్తారక్కడ. మహారాజ్‌కు మూడు, నాలుగొందల మంది శిష్యులుండేవారు. యజ్ఞంలో నిష్ఠాగరిష్ఠులు కూర్చునేవారు. అందులో నన్ను కూడా రుత్వికుడిగా కూర్చోబెట్టాలని మహారాజ్ కంకణం కట్టుకున్నారు. 'వాడిదే కులం? ఏ ఊరు? వాణ్ణి రుత్వికుడిగా ఎలా కూర్చోబెడతారు? అసలాడికి ఉపనయన అర్హత ఉందా?' అని ఆయన శిష్యులు ప్రశ్నిస్తే... 'నేను సోమయాజిని... నేనే ఉపనయనం ఇస్తాను. వాడే రుత్వికుడు' అని శిష్యులపై తిరుగుబాటు చేసి నన్ను రుత్వికుడిగా కూర్చోబెట్టారు. నా జీవితంలో మహోన్నత ఘట్టమిది.

(మరిన్ని విశేషాలు పైవారం...)

ఇల్లు కట్టేద్దాం

హాయ్ పిడుగులూ... ఇదిగో
ఇక్కడ కొన్ని ఆకారాలు వున్నాయి కదా. వాటిని మీరు జాగ్రత్తగా కత్తిరించి పై బొమ్మలో వున్న ఇంటిలా అతికించాలి. 'ఓస్! ఇదెంత పని!' అంటారా! మాకు తెలుసు. మీరు ఆ మాట అంటారని. మరి ఆలస్యం ఎందుకు కానిచ్చేయండి.



చూసి గియ్యండే

ఇక్కడ రెండు జిరాఫీలు వున్నాయి. కాకపోతే ఒకదానివీ
ఎట్లాంటి డిజైన్ లేదు. మీరేం చేస్తారంటే... మొదటి దా
చూసి రెండో దానిమీద డిజైన్ గీసెయ్యండే.

గాలిపటం చేసేద్దాం





నేర్చుకుందామా...

హాయ్! ముందుగా **మీ అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు**
సంక్రాంతి అనగానే గుర్తొచ్చేది గాలిపటాలు. వాటిని సొంతంగా
తయారుచేసి మైదానాల్లో ఎగరేస్తుంటే... ఎంత మజాగా వుంటుందో
కదూ. మరందుకే మీకోసం గాలిపటం ఎలా తయారుచేయాలో
చెప్పాలనుకుంటున్నాం. సంతోషమేనా!

ఏమేం కావాలంటే...

పెద్ద పేపర్ (రంగుదైతే ఇంకా మజా వస్తుంది. పొడవు వెడల్పుల
60సెంమీ, 40 సెంమీ వుండాలి), కత్తెర, దారం, రిబ్బన్లు, గమ్, చీపుర
పుల్లలు రెండు (ఒకటి 60 సెంటీ మీటర్లు, రెండవది 40 సెంటీమీటర్ల
పొడవుండాలి). క్రేయాన్లు, రంగులు, స్కెచ్ పెన్నులు.

ఎలా చేయాలంటే...

బొమ్మలో చూపించినట్టు 60 సెంమీ పొడవు, 40 సెంమీ వెడల
వున్న కాగితాన్ని చింపుకోవాలి. చిన్న పుల్లను కాగితానికి అడ్డంగాను, పొడవ
పుల్లను నిలువుగానూ వుంచాలి. వాటి చివర్లను చిన్న చిన్న కాగితపు
ముక్కలతో అతికించాలి. ఇప్పుడు రెండు చేతులతో పట్టుకుని చూడండి
గాలిపటం డైమండ్ ఆకారంలో కనిపిస్తోంది కదూ. ఇప్పుడు క్రేయాన్లు
రంగులు, స్కెచ్ పెన్నులతో గాలిపటం మీద మీకిష్టమైన డిజైన్లు వేయండి
ఇప్పుడు గాలిపటానికి నిలువుగా పై నుంచి కిందికి దారం కట్టాలి. అలా
అడ్డంగా కూడా దారం కట్టాలి. ఈ రెండు దారాలు (అడ్డం, నిలువు) కలి
దగ్గర గాలిపటం ఎగరవేయడానికి ఉపయోగించే దారాన్ని కట్టాలి. చివరి
గాలిపటం కింద తోకలాగా రిబ్బన్లను కట్టాలి. తోకలను కాగితంతోగా
ప్లాస్టిక్‌పేపర్‌తోగానీ తయారు చేయవచ్చు. ఇలాగే కాకుండా మీరు రకరక
ఆకారాలలో గాలిపటాలను తయారుచేయవచ్చు. మీ నేస్తాలతో కలిసి ఇళ్ల
చెట్లకు, కరెంటు స్థంభాలకు దూరంగా మైదానాల దగ్గరకు వెళ్లి గాలిపటా
ఎగరేయండి.

- కె. సాహి

బెక బెక తేడాలేంటబ్బా...





ఏమేం గదులు?

నేస్తాలూ! మన ఇంట్లో ప్రతి గదికీ ఓ పేరుంటుంది. మీకు అవన్నీ చెప్పక్కర్లేదనుకోండి. ఇదిగో ఇక్కడ ఆరు గదులున్నాయి. వాటి పేర్లూ వున్నాయి. కాకపోతే వాటి స్పెల్లింగు తికమకగా వుంది. దాన్ని జాగ్రత్తగా పరిశీలించి ఆ గదుల పేర్లను చెప్పాలి. ఎంతకీ తెలీకపోతే మా సమాధానం చూడండే.

జవాబు: KITCHEN, BEDROOM, TERRACE, BALCONY, BACKYARD, TOILETS

ఏవి ఎక్కడున్నాయో...

ఇదిగో పిల్లలూ! ఇక్కడ సర్కస్ టెంట్ వుంది. అందులో సర్కస్‌కు సంబంధించిన 15 పదాలున్నాయి. వాటిని టెంట్‌లోని అక్షరాల్లో ఎక్కడున్నాయో కనుక్కోవాలి. అదీ చిటికెలో... మరి రెడీ...1..2...3.





ఐస్‌క్రీమ్ కావాలంటే...

పీపీ

ఈ నాటి సంక్రాంతి
అసలైన పండుగ
సిసలైన పండుగ
కష్టజీవులకు అది ఎంతో
కన్నుల పండుగ అన్నాడో సినీ కవి.

మన పండుగలన్నీ తెలుగు నెలల ప్రకారం పంచాంగంలో రాశులూ నక్షత్రాలను బట్టి మారిపోతుంటాయి. కొన్నిసార్లు ఇంగ్లీషు క్యాలెండర్ లెక్కలో నెలలు కూడా మారుతుంటాయి. కాని ఒక్క సంక్రాంతి మాత్రమే జనవరి 13-14 తేదీలలోనే రావడం సర్వసాధారణం. సంక్రాంతి అంటే మార్పు అని అర్థం. పాతను తుడిచేసి కొత్తను ఆహ్వానించడానికి ఇది సంకేతమంటారు.

సూర్య చలనాలను బట్టి పండుగ తేదీ నిర్ణయమవుతుంది. సూర్యుడు ధనురాశిలో ప్రవేశించడంతో ధనుర్మాసం మొదలవుతుంది. దీన్ని నెల పట్టడం అని కూడా అంటారు. అప్పటి నుంచే సంక్రాంతి సంబరం మొదలవుతుంది. ఇందులో కూడా కొంత గజిబిజి వున్నా మొత్తంపైన సూర్యుడు ఉత్తరాయణంలో ప్రవేశించడం వల్ల కలిగే ప్రయోజనం కనక ఈ పండుగ చేసుకుంటారు. (బాక్సు చూడండి)

ధాన్యాగమన వేడుక- భోగి

సంక్రాంతిలో మొదటి రోజు భోగి పండుగ. భోగం అంటే సంపద. పల్లెల్లో సంపద ధాన్యమే కనక ధాన్య లక్ష్మి రాకను అది సూచిస్తుంది. భోగి పురుషుడు అంటారు. ఈ పండుగ మూడు రోజులూ ఇళ్ల ముందు భోగి మంటలు వేస్తారు. ధనుర్మాసం వచ్చినప్పటి నుంచి వేసిన

పల్లె జీవుల పల్లవి సంక్రాంతి

సంక్రాంతి!
తెలుగు వారి ప్రియతమ పర్వదినం. కాలాలు పద్ధతులూ ఎన్ని మారినా ప్రాధాన్యత కోల్పోని అచ్చతెలుగు పండుగ. పండుగల్లో విశ్వాసాలతో ముడిపడినవి కొన్ని, రుతువులతో ముడిపడినవి కొన్ని, వ్యవసాయంతో ముడిపడినవి ఎన్నో. సంక్రాంతి రుతువుల మార్పులతోనూ, వ్యవసాయోత్పత్తితోనూ ముడిపడిన పండుగ. చాలా పండుగల్లో దైవారాధన ప్రధానం. పూజా పునస్కారాలు ముఖ్యం. కాని సంక్రాంతిలో మాత్రం ప్రకృతికీ, జంతువులకూ, మనుషులకూ భాగముంటుంది. అందులోనూ మహిళల భాగస్వామ్యం ఎక్కువ. పల్లె జీవితంలోని ప్రతి వారూ-రైతులూ, పాలేర్లు, వృత్తిదారులూ, జానపద కళాకారులూ, క్రీడాకారులూ ఆఖరుకు వారి జీవితంలో వారి నిజమైన సహచరులుగా సేవ చేసే మూగజీవాలూ రైతులకు ప్రాణాధారమైన మొక్కలూ పూలూ అన్ని అవిభాజ్యభాగమైన ఒకే ఒక పండుగ సంక్రాంతి. అందుకే ఇది ముమ్మూర్తులా రైతు పండుగ. పల్లె పండుగ. కళల పండుగ.

సంక్రాంతి- ఖగోళ శాస్త్రం- పంచాంగం

సంక్రాంతి పండుగ మిగిలిన చాలా పండుగలవలె కాక ప్రకృతి మార్పులతో ముడిపడి వుంది. గ్రహ గతులు, ముఖ్యంగా సూర్య గమనం బట్టి దాన్ని జరుపుకొంటారు. అందుకే అది ప్రతి ఏటా జనవరి13-15 తేదీల మధ్యనే జరుగుతుంది. ఎక్కువగా 13న గాని, 14 న గాని వస్తుంది. డిసెంబర్ 22న సూర్యుడు ధను రాశిలో ప్రవేశించడంతో ఉత్తరాయణం ప్రారంభమవుతుంది. ఉత్తరాయణం అంటే క్రమ క్రమంగా సూర్యుడు ఉత్తరానికి జరగడం.అప్పటి నుంచి జూన్ 22 వరకూ ఉత్తరాయణమే. ఆ రోజున దక్షిణం వైపు మరలడం మొదలవుతుంది. ఉత్తరాయణంలో పగులు ఎక్కువ సేపు, రాత్రిళ్లు తక్కువ సేపు వుంటాయి. దీనివల్ల వేడి తగినంత వుండటంతో పంటలు బాగా పండుతాయి. పనులు జరుగుతాయి. అదే దక్షిణానికి తిరిగితే రాత్రి పొడవు పెరిగి పగళ్లు పొట్టిగా అవుతాయి. ఇది మన దేశం వంటివాటికి అననుకూలమైన స్థితి. అందువల్లనే ఉత్తరాయణంలోకి రాగానే పుణ్యకాలంగా భావించి పండుగలు చేసుకోవడం. అయితే ఇందులోనూ విచిత్రాలున్నాయి. భూమి సూర్యుడి చుట్టూ తిరగడంతో పాటు తన చుట్టూ తాను తిరుగుతుండడం వల్ల మన సంవత్సరాల లెక్కలో తేడా వస్తుంటుంది. 73 ఏళ్లకు ఒక రోజు తేడా దీర్ఘ కాలంలో చాలా అవుతుంది. భారతీయులు చంద్ర సూర్యమానాలను కలిపి ఉపయోగిస్తారనేది తెలిసిన విషయమే. క్రీశ 350 ప్రాంతాలలో వారు మకర రాశిలోకి రాగానే ఉత్తరాయణం మొదలవుతుంది గనక మకర సంక్రాంతి అన్నారు. అయితే ఇన్నేళ్లలో ఏడాదికి రోజు చొప్పున కాలం ముందుకు జరగడంతో ఇప్పుడు సూర్యుడు ధనురాశిలోకి రావడంతోనే ఉత్తరాయణం మొదలవుతున్నది. అయినా ఆచారం మారలేదు. అందుకే అది మొదలైన 23 రోజుల తర్వాత సంక్రాంతి జరుపుకొంటున్నారు.

ముగ్గులలో అమర్చిన గొబ్బిళ్లను పిడకలుగా ఎండబెట్టి భోగిమంటల్లో వేస్తారు. సంక్రాంతి సమయానికి ఇంకా తెలుగునాట చలి వుంటుంది. చంకల్లో చేతులు పెట్టుకునేంత చలి వుంటుందని నానుడి. అందుకే భోగి మంటలు అంటే పల్లెల్లో ఎక్కడ లేని సందడి. పిల్లలూ పెద్దలూ దాని చుట్టూ చేరి చలి కాచుకుంటారు. ఆ మంటలో కాగిన నీళ్లతో స్నానం చేస్తారు. అలాగే పల్లెల్లో గొడవలను కూడా భోగిమంటలతో పోల్చడం కద్దు. భోగి రోజునే పిల్లలకు పళ్లు పోస్తారు. రేగిపళ్లు, చిల్లర డబ్బులు నెత్తిపై పోస్తారు. కొన్ని చోట్ల బొమ్మల కొలువు కూడా అలంకరిస్తారు. పేరంటాలూ జరుగుతాయి. ఈ విధంగా సంక్రాంతి సంబరాలలో తల్లులూ పిల్లలకు కూడా భాగముంటుంది.

సూర్యారాధన - సంక్రాంతి



రెండో రోజు మకర సంక్రాంతి. సూర్యారాధన ప్రధానం. సూర్యుడిని దృష్టిలో పెట్టుకుని ఆతని రాకకు ఎదురుగా వుండే గృహ ప్రాంగణాన్ని ఆవుపేడతో అలికి శుభ్రం చేస్తారు. బియ్యపు పిండి, పసుపు, కుంకుమ కలిపి కొన్ని ఆచార బద్ధమైన ముగ్గులు వేస్తారు. తెలుగు వారి తక్కిన పండుగలన్నీ చంద్రమానాన్ని బట్టి జరిగితే ఒక్క సంక్రాంతి మాత్రం సౌరమానం ప్రకారం జరుగుతుంది. సూర్యుడు ఆ రోజున మకర రాశిలోకి ప్రవేశిస్తాడు. ఉత్తరాయణం మొదలవుతుంది. ఇది పవిత్రమైన కాలమని నమ్మకం. అందుకే ఈ కాలంలో పితృదేవతలకు తర్పణాలు వదులుతారు. దాని వల్ల ఉత్తరాయణ పుణ్య కాల ఫలం కలుగుతుందని భావిస్తారు. ఉత్తరాయణం అంటే దేవతలకు పగలు అని, అందువల్ల వారు తలుపులు తెరిచి వుంచుతారని నమ్మకం. ఇక కొత్త బియ్యం, కొత్త బెల్లం వగైరాలతో గారెలూ బూరెలూ చేసుకోవడం జరుగుతుంది. అరిసెలూ, గారెల వంటి పిండి వంటలు సరేసరి. అల్లుళ్లను ఆహ్వానించే పండుగగా కూడా దీనికి పేరుంది.

పశువుల సంబరం - కనుమ

'పాలిచ్చే గోవులకూ పసుపూ కుంకం, పనిచేసే బసవడికీ పత్రీ పుష్పం' అన్నట్టు వ్యవసాయ జీవితంలో రైతు కుటుంబంలో భాగమై పోయిన పశుగణాలకు కూడా సంక్రాంతి సంబరంలో భాగముంటుంది. మూడో రోజైన కనుమ పండుగ పశుసంతతికి సంబంధించిందే. వాటిని చక్కగా ముస్తాబు చేసి పూజిస్తారు. వ్యవసాయంలో రైతుకు తోడ్పడుతూ ఏడాది పొడుగునా తోడుండే పశువులను రైతు కుటుంబాలు కన్నబిడ్డల్లా చూసుకోవడం తెలిసిన విషయమే. వాటితో ఎడతెగని అనుబంధం పెంచుకుంటారు. వాటికి ఏదైనా జరిగితే ఇంటిల్లిపాదీ తల్లడిల్లిపోతారు. కోడెదూడ పుడితే మహా సంబరపడి పోతారు. అలాంటి పశువులను ముఖ్యంగా ఎద్దులను అలంకరించి ఆరాధించేందుకు రెండు సందర్భాలు వుంటాయి. సంక్రాంతి మూడో రోజున వచ్చే కనుమ ఒకటైతే ఏరువాక పౌర్ణమి మరొకటి. ఈ రెండు పండుగల మధ్య కూడా చాలా సంబంధం వుంది. ఏరువాక పౌర్ణమి రోజున సాగుచేసి వేసిన విత్తనాలతో సంక్రాంతి నాటికి పంట చేతికి వస్తుంది. ఇప్పుడు శాస్త్ర విజ్ఞానం, కొంతవరకూ నీటిపారుదల సౌకర్యాల పెరుగుదల వల్ల ఏడాదికి ఎన్నిపంటలైనా వేసే అవకాశం ఏర్పడినా ఈ ఆచారం అలాగే కొనసాగుతున్నది. అదే పూర్వపు రోజుల్లో వరిపంట ఒక్కసారే చేతికి అందేది కనక దాన్ని సంక్రాంతి పండుగగా మహా సంబరంగా జరుపుకోవడం మొదలెట్టారు. ఏరువాక రోజున కాడెత్తుకున్న ఎద్దులు సంక్రాంతి నాటికి ధాన్యాన్ని ఇంటికి చేర్చేవరకూ రైతు కోసం ఎంతగానో శ్రమపడతాయి. అందుకే అప్పుడూ ఇప్పుడూ కూడా వాటిని పూజిస్తారు.

పశువులను వళ్లంతా కడిగి చక్కగా అలంకరిస్తారు. పశువుల శాలను కూడా శుభ్రంగా అలికి ముగ్గులు పెడతారు. జేగంట కలిగిన చిరుమువ్వల పట్టీలను మెడలో వేస్తారు.వాటి కొమ్ములకు రంగు కాగితాలతోనూ ఇతర విధాలుగానూ అలంకారం చేస్తారు. ముఖానికి అటూ ఇటూ పట్టు కుచ్చులు వేల్లాడుతుంటాయి. దాని నుదుటిపై పసుపు కుంకుమలు పూస్తారు. మా భుక్తికోసం నీ కష్టాన్ని వాడుకుంటున్నాం కనక మమ్మల్ని క్షమించమని కూడా వేడుకుంటారట. బసవన్నగా, నందీశ్వరుడుగా పూజించబడే ఎద్దులకు ఆ రోజున ప్రత్యేకమైన తిండి! మంచి గుమ్మడి కాయలు, ఉలవలు మాట్టు పొంగలి, అరటి పళ్లు వగైరా పెడతారు. బండెద్ల పందేలు సరే సరి. ఎద్ల పందేలలో బరువులు లాగడం, పరుగెత్తడం రకరకాలు వుంటాయి. ఈ పందేలలో గెలిచే ఎద్దుకు, దాని రైతుకు ఎక్కడలేని గౌరవ ప్రతిష్టలు. దానికి ధర కూడా ఎక్కువగా పలుకుతుంది. మాంచి కోడె

సంక్రాంతి సినిమాలు!

తెలుగు సినిమాకు సంక్రాంతికి విడదీయరాని సంబంధం వుంది. పల్లెటూరి కథల్లో ఏదో ఒక విధంగా సంక్రాంతి పాటల్లో వేడుకలు చూపిస్తుంటారు. 'పొంగి పొంగి వచ్చినాది సంబరాల సంక్రాంతి సంక్రాంతి హోయ్' అంటూ ఇంటికి దీపం ఇల్లాలే చిత్రంలో పాట పల్లె జీవితంలో రావలసిన మంచి మార్పులను ప్రబోధిస్తూ సాగుతుంది. 'వూరంతా సంక్రాంతి' చిత్రంలో 'సంబరాల సంక్రాంతి, వూరంతా పిలిచింది' అంటూ బృంద గానం సాగుతుంది. 'మంచిరోజులు వచ్చాయి'లో ఈనాటి సంక్రాంతి అసలైన పండుగ అని పాడే కథానాయకుడు అప్పటి రాజకీయ వాతావరణాన్ని బట్టి వున్నవాళ్ల పెత్తనం వూడుతుందని సోషలిజం వచ్చేరోజు దగ్గరుందని ప్రకటిస్తాడు. భోగి మంటలు చిత్రం పేరులోనే గాక కథలో కూడా సంక్రాంతికి భాగముంటుంది. 'ఉండమ్మా బొట్టుపెడతా'లో కృష్ణశాస్త్రి పాట. 'రావమ్మా మహాలక్ష్మి రావమ్మా..నీ కోవెల ఈ ఇల్లు కొలువై వుందువు గాని.. కొలువై వుందువు గాని కలువలరాణి' అంటూ హరిదాసు సంక్రాంతి సంబరాలను, సంరంభాలను మనోహరంగా వర్ణిస్తే బాలు మధుర గానంలో ఆ పాట చిరస్థాయిగా నిల్చింది. ఇక సంక్రాంతి చిత్రాల కోసం 'రసజ్ఞ' ప్రేక్షకులు లేదా వీరాభిమానులు ప్రత్యేకంగా వేచి చూస్తుంటారు. ఎంత ఖర్చు పెట్టారు, విజయావకాశాలేమిటి అన్న దానిపై బోలెడు వూహాగానాలు. ఈ ఏడాది కూడా బాలకృష్ణ 'ఒక్కమగాడు', రవితేజ త్రిషల'కృష్ణ', ఎం. ఎస్. రాజు. 'వాన' మరికొన్ని చిత్రాలు విడుదలవుతున్నాయి. వీటిపై యాభై కోట్ల వరకూ ఖర్చు చేసినట్టు అంచనా. అంతిమంగా వీరి భవితవ్యం నిర్ణయించేది ప్రేక్షక దేవుళ్లే!





దూడలను ఆంబోతులుగా వదలివేస్తారు. ఇవి స్వేచ్ఛా జీవులు. కనుమ రోజున వాటిని కూడా పూజిస్తారు. కనుమ మరుసటి రోజు కొందరు ముక్కనుమగా జరుపుకొంటారు. ఆ రోజున వారి వారి ఆచారాలను, అవకాశాలను బట్టి మాంచి మాంసాహారం తీసుకుంటారు. తమ ఇళ్లకు వచ్చిన బంధుమిత్రులకు బట్టలు పెట్టి పంపిస్తారు.

వూగూగు గంగెద్దా!

మామూలు ఎద్దులకు తోడు సంక్రాంతి అంటే గుర్తుకు వచ్చేది గంగిరెద్దులాటలు. పని చేయించుకోవడంతో పాటు వినోదానికి కూడా పశువులతో వినోదించడం కూడా పల్లె జీవితంలో భాగమే. వాటినే నమ్ముకుని పొట్టపోసుకునే వారు కొందరు. యాదవులలో పూజ గొల్లలనే వారు గంగిరెద్దులను ఆడిస్తుంటారు. కోడెదూడగా వున్నప్పుడే దానికి శిక్షణనిస్తారు. చెప్పిన ప్రకారం పని చేస్తాయి గనక గంగిరెద్దులా తలాడించడం అనే మాట కూడా పుట్టింది. మొదట్లో ఈ విధంగా తలాడించడానికే పరిమితమైన స్థితి పోయి ఇప్పుడు వాద్యాలకు అనుగుణంగా అడుగులు వేయించడం, ముందు కాలు వంచి నమస్కారం చేయడం, కళాకారుడి తొడపై ఎద్దును నిలబెట్టుకోవడం, గుండెలపై ముందరి కాళ్లుంచి నృత్యం చేయడం, నాలుగు కాళ్ల ఎత్తు పీటపై నిలబడటం వంటి ఎన్నో ప్రక్రియలు కొత్తగా చేరాయి. ఇలా ఆడించే ఆవులను సీత అని, ఎద్దును రామ లక్ష్మణులని పిలుస్తారు. సీతారామ కళ్యాణం కూడా జరిపిస్తారు. వివాహం, దాంపత్య జీవితం తదితర అంశాలపై హాస్యంగా మాట్లాడుతూ వాటితో విన్యాసాలు చేయిస్తారు. డోలు సన్నాయి బూరల కలయికలో గంగిరెద్దుల మేళం సాగుతుంది. సంగీతం, విన్యాసాలు కలగలసి వుంటాయి. 'గంగిరెద్దు కళాకారులకు దానం చేయడం తప్పనిసరి' అనే విశ్వాసం ఇప్పటికీ వుంటుంది. గంగిరెద్దుల కోసం రంగు రంగుల దుస్తులు పాతవైనా సరే ఇస్తుంటారు. ఇందులో గంగ అనే మాట ఈశ్వర సంబంధాన్ని, పవిత్రతను సూచిస్తుంది. గంగిరెద్దును ఎలా అలంకరించాలనే దానిపై బోలెడు నమ్మకాలున్నాయి. అలాగే వాటిని ఆడించే వారి వేషధారణ కూడా గంభీరంగా వుండాలి. గుబురు మీసాలు, పంగనామాలు, తిరుచూర్ణం, పంచె కట్టుపై పాతదైనా సరే నల్లకోటు వగైరాలు వుంటాయి (బ్రిటిష్ వారి పాలనా కాలంలో కోటు ధరించడం వచ్చిందని పరిశోధకుల భావన). వాద్యకారుడు, ఇంటింటా వేసే దాన ధర్మాలు స్వీకరించే వాడు కలసి జట్టుగా వుంటారు.

అయ్యగారికి మేలు జరగాలి ❖ ఇల్లు పిల్లా పాపలతో కళకళ లాడాలి ❖ సిరిసంపదలు కలగాలి ❖ అమ్మగారి వాడి నిండాలి ❖ అని దీవిస్తూ మెప్పించే గంగిరెద్దుల ఆటలు ఇప్పుడు తగ్గుముఖం పట్టినా వాటి ముద్ర చెరిగిపోయేది కాదు. కోట గీత గంగిరెద్దులాటపై ప్రత్యేకంగా పరిశోధన చేసి అనేక విషయాలు వెల్లడించారు.

ముగ్గుల ముచ్చట్లు

ఇక సంక్రాంతికి సంకేతం ముగ్గులు, అందులోనూ గొబ్బెమ్మలు. వీటిపైనా బోలెడు కథలున్నాయి. ఇది అరవై కళల్లో ఒకటని వాత్సాయనుడు చెబుతాడు. అంగనల కళా దృష్టికి అద్దం పట్టేవి రంగవల్లులు. 'తీరైన సంపద ఏ ఇంటనుండు/ దినదినము ముగ్గున్న లోగిళ్లనుండు' అని ఆరుద్ర సంప్రదాయాన్ని గానంచేశారు. మామూలు రోజుల్లో కన్నా సంక్రాంతి సమయంలో వీటికి విలక్షణత వుంటుంది. వాటిని ఆయా





ప్రాంతాలలో పట్టులు, పరికలు, ఊరంగులు, పోతలు వగైరా రకరకాల పేర్లతో పిలుస్తారు. జానపద చరిత్ర ఎంత పురాతనమైనదో ముగ్గులూ అంత పురాతనమైనవే. అరచేతిలోకి ముగ్గుపిండి తీసుకుని పిడికిలి బిగించి బొటన వేలు, చూపుడు వేలు మధ్య సందు నుంచి దాన్ని జారుస్తూ ముందే నిర్ణయించిన చుక్కల ప్రకారం వివిధ వ్యూహ చిత్రాలు లేదా ముగ్గులు వేస్తారు. రథం ముగ్గు వంటివి వరుసగా వేస్తూ పోతారు. సంక్రాంతి నెలలో వేసే ముగ్గులలో గీతల ప్రాధాన్యత ఎక్కువ. వీటికి... రామాయణంలో లక్ష్మణ రేఖలుగా చెప్పే వాటికి మధ్య సంబంధం వుందంటారు. ధనుర్మాసంలో భిక్షాటనకు వచ్చే జంగం దేవరలు కూడా సీతాపహరణానికి వచ్చిన రావణాసురుని వేషంలో వుండటం తెలిసిందే. అందుకే ముగ్గు దాటకుండా భిక్ష వేయాలని చెబుతుంటారు. ఈ ముగ్గులను కోస్తా ప్రాంతంలో పోత ముగ్గు అంటే తెలంగాణా ప్రాంతంలో గోటుముగ్గు అంటారు.

'చందనంబున గలయింపి చల్లినారు
ముగ్గుల నిడి వారు కాశ్మీరమున ముదమున
వ్రాసినారింది రజమున రంగవల్లి
కంజముల దోరంబులు కట్టినారు' అని 'క్రీడాభిరామం'లో శ్రీనాథుడు రాశాడు. 'గాదెల్లో ధాన్యం లోగిళ్ల లాస్యం' అని కృష్ణశాస్త్రి ఈ అవినాభావ సంబంధాన్ని అభివర్ణించారు.

కోడి పందేలకు చెక్

ఒకప్పుడు సంక్రాంతి అంటే కోడి పందేలు జోరుగా సాగుతుండేవి. వీటిలో పల్లెల సంబరాలతో పాటు జూదాలు, ఆవేశ కావేశాలు కూడా పెరిగేవి. పల్నాటి యుద్ధం యావత్తూ కోడి పందేల కథే. చాలా సంవత్సరాలుగా కోడి పందేలను నిషేధించారు గాని ఇప్పటికి తెలియకుండా మారుమూల ప్రాంతాలలో జరుగుతూనే వుంటాయి. వాటిని వేటాడ్డం పోలీసులకు నివేదించడం మీడియాకూ ఒక పెద్ద పని! ఇది వరలో విచిత్ర వేషాలుంటే ఇప్పుడు రికార్డింగు డాన్సులు ఏర్పాటు చేయడం కూడా సమస్యగా తయారైంది. అయితే అరుదుగా ఎక్కడో జరిగే ఈ తతంగాలు సంక్రాంతి సంరంభానికి అపశ్రుతులు తప్ప ప్రధానమైనవి కావు.

ఇక ముగ్గుల మధ్యలో వుంచే గొబ్బెమ్మలు మాత్రం సంక్రాంతికే ప్రత్యేకం. ఈ పేరు ఎలా ఎందుకు వచ్చిందనే దానిపై అనేక వాదనలున్నాయి. గొబ్బి అంటే గోబర్ పేడ కనక ఈ విధంగా మాట వచ్చిందంటారు. అలాగాక శ్రీకృష్ణుడితో నాట్యమాడిన గోపెమ్మలకు ప్రతిరూపాలుగా ఈ మాట పుట్టిందనే వాదన ఇంకోటి. ఏదైనా సంక్రాంతి నెల పట్టిన నాటినుంచి రంగవల్లికలలో పూలు అమర్చిన గొబ్బెమ్మలను అలంకరిస్తూనే వుంటారు. వీటిని లక్ష్మీదేవితో గౌరీ దేవితో సమానంగా భావిస్తారు. 'ఆముక్తమాల్యద' కావ్యంలోని గోదాదేవి విష్ణు మూర్తిని మార్గశిర మాసంలో ఆరాధించింది గనక దీన్ని కన్నెల కోర్కెలు ఈడేర్చే మార్గంగానూ చెబుతుంటారు. తిరుపతిలో కూడా ధనుర్మాసంలో సుప్రభాతం బదులు గోదాదేవి పూజకు సంబంధించిన తిరుప్పావై పఠిస్తారు. గొబ్బెమ్మల చుట్టూ గొబ్బి నృత్యం కూడా చేస్తారు. "కొలని దేవరకు గొబ్బిళ్లో ❖ యదుకుల స్వామికి గొబ్బిళ్లో ❖ కొండగొడుగుగా గోవులు కాచిన కొండక శిశువుకు గొబ్బిళ్లో" వంటి పాటలు పాడతారు. 'సుబ్బీ గొబ్బెమ్మ సుఖములియ్యవే ❖ తామర పువ్వంటి తమ్ముణ్ణీయవే ❖ చేమంతిపువ్వంటి చెల్లెల్నియ్యవే ❖ మొగలి పువ్వంటి మొగుణ్ణీయవే ❖ మంకెన పువ్వంటి మరిదినియ్యవే' ఇలా సాగే పాటల్లో వారి కోర్కెలతో పాటు కుటుంబ సంబంధాల ప్రగాఢత కూడా కనిపిస్తుంది.

నగరాల్లో కలర్‌ఫుల్
పతంగులు,వేడుకలు

సంక్రాంతి పల్లె జనం పండుగే అయినా దాని ప్రభావం పట్టణాలూ నగరాల్లో చాలా ఎక్కువగా వుంటుంది. మొదటి విషయం- ఎప్పుడూ ఇళ్లు కదలనివాళ్లు కూడా పండుగకు మాత్రం అటు అత్తగారిళ్లకూ ఇటు అమ్మగారిళ్లకూ లేదా విహార యాత్రలకూ బయల్దేరతారు. దాంతో బస్సులూ రైళ్లూ కిటకిటలాడిపోతాయి. ఆ విధంగా వేలబస్సులు వేశారని, అయినా టికెట్ల రద్దీ తగ్గలేదని వార్తలు వస్తూనే వున్నాయి. టూ ఇంటలిజెంట్ సాహసికులు వీటి మధ్యలోనే మజాగా వుంటుందని ప్రయాణాలకు సిద్ధమవుతుంటారు!.

ఇక నగరాల్లో ముఖ్యంగా హైదరాబాదులో సంక్రాంతి తరుణంలో పతంగుల పండుగ జరుపుతారు. రంగురంగుల పతాకాలను విహాయస వీథుల్లో ఎగరేసి ఏది ఎక్కువపైకి

పోయిందంటూ పోటీలు పడతారు. ఈ వారం రోజులూ ఇదో సందడి. ఇటీవలి కాలంలో సాఫ్ట్‌వేర్ కంపెనీలు ముగ్గుల పోటీలు, నృత్య గానాలను ప్రోత్సహిస్తున్నాయి. పల్లె పట్టురంగు వల్లులకు హైటెక్ సొబగులు అద్దే ఈ సంబరాలు సరికొత్త మిశ్రమ సంస్కృతిని ప్రతిబింబిస్తున్నాయి.

సంక్రాంతికి స్వాగతం

సంక్రాంతి వేడుకల్లో 'హరిలో రంగ హరి' అంటూ మాల దాసరులు పాడే పాట మార్మోగుతుంది. ఈ విధంగా సమాజంలోని అన్ని తరగతులకూ ఇందులో భాగస్వామ్యం వుంటుంది.

సంక్రాంతిని పోలిన పండుగలు ఇతర దేశాలలోనూ వ్యవసాయ సమజాలన్నిటిలోనూ వుంటాయి. అయితే పల్లెలు పచ్చ పచ్చగా విలసిల్లితేనే సంక్రాంతి శోభ, సౌందర్యం. సమాజ పరిణామాలు సాంకేతికాభివృద్ధి అనేక మార్పులకు కారణమైతే వ్యవసాయ రంగ సంక్షోభంలో సంక్రాంతి సంతోషం అదృశ్యం అవుతున్నది. పంటలు వేసుకునే పరపతి లేక, పండిన పంటకు ధరలు రాక రైతుల అప్పుల బాధలు ఆత్మహత్యల మధ్య సంక్రాంతి గురించి ఎంత చెప్పినా సమస్యలు వెన్నాడుతూనే వుంటాయి. అందుకే సంక్రాంతిని క్రాంతి సూచకంగా చేసుకునేంత వరకూ ఈ పరిస్థితి మారదు. నిజమైన సంబరాలూ వుండవు. మనం కలసి మెలసి సంతోషించే అలాంటి అద్భుతమైన కాలం కోసం ఎదురు చూస్తూ ప్రస్తుతానికి సంక్రాంతిని స్వాగతిద్దాం.

❋



సవాలి

ఎన్.వి.యస్. నాగభూషణాచార్యులు

వరండాలోని సోఫాలో నిశ్శబ్దంగా కూర్చుంది అవలోకిత. గజిబిజి గూటిలో చిక్కుకుని, దారి తెలియక గింజుకులాడే రెక్కల పురుగులా ఆమె మనస్సెక్కడో చిక్కుకుపోయింది. మళ్లీ దాన్ని దారిలోకి తెచ్చి, స్థిమితంగా కనబడుదామని ఎంత ప్రయత్నించినా సాధ్యం కావడం లేదు.

ఆఫీసుకు వెళ్ళడానికి తయారై స్కూటర్ దగ్గరకు వెళ్ళిన లూషన్... ఎదురుగా తల్లి వరండాలో కూర్చుని ఉండటం గమనించి, గబగబా ఆమె దగ్గరకు వచ్చి, "ఏమిటమ్మా.... ఈ రోజు కాలేజీకి వెళ్లడం లేదా?" అడిగాడు ఎనిమిదో వింతను చూస్తున్నంత ఆశ్చర్యంగా.

"లేదురా... నా మనస్సేం బాగోలేదు. వెళ్ళాలనిపించడం లేదు" అందామె పొడిగా.

ఎందుకో అనమానం వచ్చి భార్యను తారీకెంతని అడిగాడు లూషన్. ఆమె చెప్పింది. దాంతో అతని మొహంలో పశ్చాత్తాపం వ్యక్తమై, తల్లి పక్కగా కూర్చుని, "సారీ అమ్మా. ఇన్‌స్పెక్షన్ హడావిడిలో పడిపోయి ఈరోజు సంగతే మర్చిపోయాను... వెరీసారీ! సెలవు పెట్టే అవకాశం లేదు. అయినా సాయంకాలం పర్మిషన్ తీసుకొని వస్తాను. ఎక్కడా... ప్రెస్‌క్లబ్‌లోనేనా?" అడిగాడు ఆమె భుజం మీద చెయ్యివేసి.

"ఫర్వాలేదురా! ఇన్‌స్పెక్షన్ అంటున్నావ్... ముందు దాని సంగతి చూడు. ఇలాంటి రోజులు ప్రతి సంవత్సరం వస్తూనే ఉంటాయి! నేను ఇవాళ ఒంటరిగా వుండాలనుకుంటున్నాను" అందామె అతని చేతిని పక్కన బెట్టి.

ఆమె పరిస్థితి అర్థం చేసుకున్న సుదీప్తి, లూషన్ మౌనంగా లేచి వెళ్లారు.

కొడుకూ కోడలూ వెళ్ళి పోయాక సోఫాలో కూలబడి గతాన్ని గుర్తు తెచ్చుకోసాగింది. ఎంత విచిత్రంగా తన జీవితం లోకి ప్రవేశించాడతను! సరిగ్గా ఈ రోజే... ప్రవేశించడమూ, నిష్క్రమించడమూ... కాకతాళీ యంగా ! ఆ రోజు తనకు బాగా జ్ఞాపకం ఉంది. అమ్మకు జబ్బు చేసి మంచం పడితే, తను స్కూలు ఫైనల్ చదువుతున్నది. కాస్త చదువు మానేసి, అమ్మకు సేవ చేసింది. అయినా లాభం లేకపోయింది. నాన్న ఎక్కడున్నాడో తెలీదు. తెలీకపోయినా ఎక్కడోక్కడ క్షేమంగా ఉన్నాడనే భావన తననుధైర్యంగా ఉండేట్టు చేసింది. ఇంట్లోని సామాన్లన్నీ ఒక్కొక్కటే అదృశ్యం అయ్యాయి. ఓ రోజు పిడుగులాంటి వార్త పత్రికల్లో పెద్దక్షరాల్లో వచ్చింది. నాన్న చచ్చిపోయాడు. కాదు, చంపేశారు! ఎన్‌కౌంటరన్నారు పోలీసులు. నాన్నకి నక్సల్స్‌తో సంబంధం లేదు. కార్మిక నాయకుడు. అంతే! అయినా నక్సల్ పేరు పెట్టి చంపేశారు! ఇది ముందే ఊహించి నాన్న కనబడ కుండా వెళ్ళిపోయాడు. అయినా పోలీసులు వదల్లేదు.

> అతను మాత్రం కాలికి బలపం కట్టుకున్నట్టు గిరిజన గూడాలు తిరిగాడు. ఏయే గూడాల్లో ఎంత మంది అప్పటికే మరణిం చిందీ, ఇంకా ఎంత మంది మృత్యు శయ్యల మీద నిరీక్షిస్తున్నదీ వివరాలతో సహా సేకరించి ప్రజల దృష్టికీ, ప్రభుత్వ దృష్టికీ తీసుకొచ్చేందుకు కృషి చేశాడు. ప్రభుత్వం సాయం చేసే దాకా నిరీక్షించక, వలంటీర్లను సమీకరించి, అత్యవసర మందుల్ని సేకరించి గూడాల్లో పంపిణీ చేసేందుకు ప్రయత్నించాడు. వైద్యుల్నీ, లాబ్ సిబ్బందినీ బతిమిలాడి ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాడు. ఆ శిబిరాలకు దారీ తెన్నూలేని కొండల్నుండీ, కోనల్నుండీ రోగుల్ని మోసుకొచ్చేం దుకు నడుం బిగించాడు. ఆ క్రమంలోనే విష జ్వరం బారిన పడ్డాడు. సాధారణ మలేరియా అనుకొని నిర్లక్ష్యం చేశాడు. అయితే లక్షణాలు కొత్తగా కనబడేసరికి మిత్రులు కంగారు పడి బలవంతంగా డాక్టర్ల దగ్గరకు తీసుకెళ్లేసరికే పరిస్థితి చెయ్యిదాటింది!

ఇంక తనకి ఈ లోకంలో ఎవరున్నారు? ప్రపంచమే శూన్యంగా కనిపించింది. ఆదుకునే బంధువులు కూడా ఎవరూ లేరు. వాళ్ళంతా ఎప్పుడో తమని వదిలేశారు. తనకిక దిక్కెవరు? ఎలా బతకాలి? ఎందుకు బతకాలి. జనం కోసం బతికిన నాన్న చనిపోయాడు. ఇల్లే సర్వస్వంగా బతికిన అమ్మ చనిపోయింది. ఇప్పుడు తను ఒంటరిది.

ఎందరెందరో వచ్చారు. ఓదార్చారు. ఏవేవో మాటలు చెప్పారు. ఏవేవో ఇవ్వబోయారు. తను ఒక్కటీ తీసుకోలేదు. జనంమీద పడి బతకడం ఇష్టంలేకపోయింది. ఆ ఊరు వదిలి వెళ్లేందుకు సిద్ధపడింది. ఎక్కడికి వెడతావన్నారు. ప్రపంచం విశాలమైనదన్నది. ఎలా బతుకుతావన్నారు. రెక్కలున్నాయి, ఏదో పని చేసుకొని బతుకుతానంది. ఆ పని ఇక్కడే చేసుకోమన్నారు. చిన్నపిల్లల్ని పంపించి ట్యూషన్లు చెప్పమన్నారు. ఆపిల్లల్లో తనూ ఒక పిల్లయింది.

వారితో ఆడింది, పాడింది. వాళ్లున్నంతసేపు తను ఈ లోకాన్ని మర్చిపోతుంది. వాళ్లు వెళ్లిపోతే తిరిగి తనకు ఒంటరితనం ఆవరిస్తుంది. అలా బతుకు ఈడుస్తున్న సమయంలో అతను వచ్చాడు ఓ రోజు!

దూరం నుంచి వచ్చాడేమో బట్టలు నలిగి ఉన్నాయి. జుట్టూ అంతే, తన ఆకారం మీద ఏ మాత్రం శ్రద్ధ లేనట్ల కనిపించాడు. ముఖంపై చెరగని చిరునవ్వు... ఎవరింటికో వెళ్ళబోయి తనింటికి వచ్చాడనుకుని, "ఎవరు కావాలి?" అనడిగింది.

"మీరే!" అన్నాడు అదే చెరగని చిరునవ్వుతో.

"ఏమిటి?" కసిరినట్లు కోపంగా అంది. అతను తన కోపాన్ని చూసి తడబడి, "ఫలానా వారి అమ్మాయి మీరేగదండీ?" అన్నాడు బెరుగ్గా. అతని తడబాటుకి తను 'పాపం' అనుకుని, నేనే, ఏం పనిమీద వచ్చారో చెబుతారా?" అనడిగింది.

"అలా సూటిగా అడిగితే ఎలాగండి చెప్పడం?" అన్నాడతను.

లోపలికెళ్లి మంచినీళ్లు తెచ్చిచ్చి "చెప్పండి... ఇప్పటికైనా" అన్నది. ఇలాంటి వాళ్ళను చాలా మందిని చూసింది. ప్రతి రోజు ఒకళ్లో ఇద్దరో వస్తూనే ఉంటారు. తండ్రి చనిపోయినందుకు సంతాపం తెలుపుతూ, సానుభూతి తెలియజెప్పేందుకు. అయితే అందువల్ల తన మూడ్ ఎంత డిస్టర్బ్ అయ్యేదీ వారికేం తెలుసు? ఇతనూ అందుకే వచ్చారనుకుంది. అతను "ఒక్కమాటలో చెప్పే పని కాదు, సావధానంగా చెబుతాను" అంటూ భుజానికి వేలాడుతున్న సంచీ పక్కన బెట్టి, "నా పేరు సుందరం, వైజాగ్‌లో లెక్చరర్‌గా పని చేస్తున్నాను" అంటూ తనని గురించి పరిచయం చేసుకున్నాడు. ఆనక, "మీ ఇంట్లో పెద్దవారెవరైనా ఉన్నారా? ఉంటే పిలవండి. వారితో మాట్లాడతా" అన్నాడు.

తను నవ్వి, "నాకు నేనే పెద్ద. ఫర్వాలేదు చెప్పండి. ఏ విషయమైనా సందేహించ నక్కరలేదు" అన్నది.

అయినా అతను చెప్పడానికి సందేహించాడు. "పోనీ... మీ మంచీ చెడ్డా చూసే గ్రామ పెద్దలుంటే చెప్పండి. ఈ విషయాలు మీతో చెబితే బాగోదేమో!" అన్నాడు చివరికి.

"మీరు అనవసరంగా మొహమాట పడుతున్నారు. మీరెవ్వరో నాకు తెలియదు. అంతగా అవసరమైతే ఇతరులతో సంప్రదిస్తాను. ముందు విషయమేమిటో చెప్పండి!" అంది తను

కొంచెం విసుగొచ్చి.

ఇకతను తప్పదన్నట్లు, "ఏం లేదు. మీ భవిష్యత్తుకు సంబంధించిన ఓ ముఖ్యమైన విషయం మాట్లాడాలని వచ్చాను. మీ తరఫున పెద్దవారుంటారేమోనంటే ఎవరూ లేరు. అందుకే మీతో మాట్లాడడానికి సందేహించాను. దీన్ని మీరేవిధంగా అర్థం చేసుకుంటారో తెలియదు. అయినా చెప్పక తప్పదుగదా ఇంత దూరం వచ్చి. నేను కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తున్నట్లు ఇంతకు ముందే చెప్పానుకదా! అది నా వృత్తి. అయితే ప్రవృత్తి సోషల్ వర్క్! ముఖ్యంగా గిరిజన సమస్యలపై పనిచేస్తుంటాను. నా తల్లిదండ్రులు నిరక్షరాస్యులు. వారిద్దరూ నా చిన్నప్పుడే పోయారు. ఒకరకంగా చెప్పాలంటే అనాథగా హాస్టళ్లలో ఉండి చదువుకున్నాను. నా ఈ జీవిత గమనానికి ఓ పెద్దాయన మార్గదర్శి. ఆయన సలహాదారుగా ఉన్న కార్మిక సంఘంలోనే మీ ఫాదర్ పనిచేశారట! పలుకుబడిగల పెద్దల మార్గదర్శకత్వంలో మీ ఫాదర్ ఎన్‌కౌంటర్ అయినట్లు తెలిసింది. నా మార్గదర్శి అయిన పెద్దాయన నాకో కర్తవ్యాన్ని నిర్దేశించారు. ఆయన ఆజ్ఞానుసారమే నేనిక్కడకు వచ్చాను. ఆయన నిర్దేశించిన కర్తవ్యం ఏమిటంటే - మిమ్మల్ని పెళ్లాడమని.. అతని మాట ఇంకా పూర్తవలేదు.

"ఏంటి..?" అంది తను ఉలిక్కిపడి.

"కంగారు పడకండి. పెళ్ళి అనేది ఇద్దరు వ్యక్తులు ఇష్టపడి చేసుకునేది! బాగా ఆలోచించుకుని మీ నిర్ణయం తెలియజెయ్యండి. మీ శ్రేయోభిలాషులు ఎవరైనా ఉన్నట్లయితే వాళ్లని పంపించి నా గురించి విచారించండి. ఇదుగో నా అడ్రస్...." అంటూ ఓ కాగితం మీద వివరాలు రాసిచ్చాడు.

"అంటే జాలితోనో. సానుభూతితోనో ఈ నిర్ణయం తీసుకున్నారన్నమాట!" అంది తను వెంటనే.

తిరిగి అతను చిరునవ్వుతో..."ఉద్యమాల్లో పని చేసేవారికి కర్తవ్యం ఒక ముఖ్యమైన విషయం. దాన్ని బట్టే అతని ఇష్టాయిష్టాలు ఆధారపడి ఉంటాయి. మీది ఒక కార్మిక కుటుంబం. అందునా ఓ ఉద్యమ నేపథ్యమున్న కుటుంబం. కష్టాల్లో ఉన్న మీ కుటుంబాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత కార్మిక సోదరుల మీదుంది. పెళ్ళి అనే ప్రక్రియ ద్వారా కూడా ఆ పని చెయ్యొచ్చు. మీ మనసులో ఇంకెవరూ లేకపోతే, నా నేపథ్యం మీకు నచ్చితే మిమ్మల్ని పెళ్ళి చేసుకుంటాను!"

అసలు పెళ్ళి గురించి ఆలోచనలు లేని తనకు అతని మాటలు ఆలోచింపజేశాయి. ఎదుటి వ్యక్తిని గౌరవించే తీరు, సంస్కారం, ఆలోచనావిధానం, సేవాతత్పరత ముగ్ధురాల్ని చేశాయి. కొద్ది రోజుల్లోనే తమ పెళ్ళి జరిగింది. అలా అతను తన జీవితంలోకి ప్రవేశించి ఎంతగానో తనను ప్రభావితం చేశాడు.

ఒంటరి శిలలాంటి తన బతుకును నందనవనం చేశాడు. నూతిలో కప్పలా ఆ కుగ్రామానికి పరిమితమై తనకు ఈ విశాల విశ్వాన్ని పరిచయం చేశాడు. అంతేనా? ఎన్ని చేశాడు తనకు! ఎంతగా శ్రమించాడు తనకోసం! తన మనసు విశాలం కావడానికి ఎంత సహాయం చేశాడు! ఎన్ని విషయాలు తెలియజెప్పాడు! చదువు చెప్పాడు, చదివించాడు. ఏదో సాధించాలన్న తపన కలగజేశాడు! ఇంత మాత్రమేనా? తనకు ఆలోచనల్ని రగిలించాడు. ఆలోచించడం నేర్పాడు. తను ఓ సంపూర్ణ వ్యక్తిగా ఎదిగేందుకు దోహదం చేశాడు!

కేవలం తన ఒక్కర్తెకేనా సహాయం చేసింది? ఎంతో మందికి.. ఎన్నో రకాలుగా! ఎన్ని కార్యక్రమాలు నిర్వహించాడు! ఇప్పటికీ నాగరిక మానవుల మొహం చూడని గిరిజన గ్రామాల్ని ఒంటరిగా చేరుకున్నాడు. వారి దుర్భర స్థితిని ప్రపంచానికి చూపించాడు. జంతువుల్లా బతికే వారి హీన స్థితిని చూసి సభ్య సమాజం తలవంచుకునేలా చేశాడు. గిరిజనులు అటవీ సంపదను నాశనం చేస్తున్నారన్న ప్రచారంలోని దుర్బుద్ధిని ఎండ గట్టాడు. రాజకీయ నాయకులూ, కాంట్రాక్టర్లూ, అటవీ అధికారులూ కలగలిసి రాష్ట్రంలోని అటవీసంపదను ఏయే ప్రాంతంలో ఎంతెంత దోచుకుంటున్నదీ పరిశోధించి మరీ వార్తా కథనాలుగా రాశాడు. గిరిజనుల కోసం పాటుబడే వివిధ సంఘాలు కలిసి కట్టుగా సమస్యల సాధన కోసం కృషి చేయడానికి తోడ్పడ్డాడు.

అయితే ఇన్ని కార్యక్రమాలు నిర్వహించడానికి సమయం ఏది? ఓ పక్క వుద్యోగం వుందిగా! అయినా వెనుకడుగు వెయ్యలేదు. సెలవుపెట్టి కొంత, ఖాళీ సమయాన్ని వాడుకొని కొంత, రోజుల తరబడి, వారాల తరబడి కార్యక్రమాల్లో మునిగి తేలేవాడు. మేనేజ్‌మెంటు వారు ఎన్ని శెలవుల్ని ఆమోదిస్తారు? జీతం కోత పెట్టి, ఇంక్రిమెంట్లు నిలుపుదల చేసి, సర్వీసు బ్రేకులు చేసి, చివరికి ఉద్యోగం నుంచి తీసేసే పరిస్థితి వచ్చినా వెనుకాడలేదు. తనుకూడా అతను నిరుత్సాహ పడకుండా ప్రోత్సహించింది. తనూ ఓ ప్రైవేట్ కాలేజీలో పార్ట్‌టైం లెక్చరర్‌గా చేరి కుటుంబానికి ఆర్థిక ఇబ్బందులు లేకుండా చూసింది. కొడుకు పుట్టడం, వాడి పెంపకం తన ఉద్యోగం జీవితం వగైరాల వల్ల అతనితో పాటు ఆ కార్యక్రమాల్లో తను చురుగ్గా పాల్గొనలేకపోయినా, అతనికి తగిన అండదండలందించింది.

ఆ సంవత్సరం వర్షాలు విస్తారంగా పడి దోమలు విజృంభించడంతో మన్నె ప్రాంతాలన్నీ మలేరియాతో పాటు, రకరకాల విషజ్వరాలు విజృంభించాయి. వైద్యం అందక వందలాది గిరిపుత్రులు పిట్టలు రాలిపోతున్నట్లు రాలిపోతున్నా, ప్రభుత్వానికి చీమైనా కుట్టింది కాదు. పదవిలో ఉన్న నాయకుడు ముక్కు చీదినా బాక్సు కట్టి మరీ రాసే పత్రికలు ఈ విషయం తెలియనట్లే వ్యవహరించాయి. కానీ అతను మాత్రం కాలికి బలపం కట్టుకున్నట్టు గిరిజన గూడాలు తిరిగాడు. ఏయే గూడాల్లో ఎంత మంది అప్పటికే మరణించిందీ, ఇంకా ఎంత మంది మృత్యు శయ్యల మీద నిరీక్షిస్తున్నదీ వివరాలతో సహా సేకరించి ప్రజల దృష్టికీ, ప్రభుత్వ దృష్టికీ తీసుకొచ్చేందుకు కృషి చేశాడు. ప్రభుత్వం సాయం చేసే దాకా నిరీక్షించక, వలంటీర్లను సమీకరించి, అత్యవసర మందుల్ని సేకరించి గూడాల్లో పంపిణీ చేసేందుకు ప్రయత్నించాడు. వైద్యుల్నీ, లాబ్ సిబ్బందినీ బతిమిలాడి ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాడు. ఆ శిబిరాలకు దారీ తెన్నూలేని కొండల్నుండీ, కోనల్నుండీ రోగుల్ని మోసుకొచ్చేం దుకు నడుం బిగించాడు. ఆ క్రమంలోనే విష జ్వరం బారిన పడ్డాడు. సాధారణ మలేరియా అనుకొని నిర్లక్ష్యం చేశాడు. అయితే లక్షణాలు కొత్తగా కనబడేసరికి మిత్రులు కంగారు పడి బలవంతంగా డాక్టర్ల దగ్గరకు తీసుకెళ్లేసరికే పరిస్థితి చెయ్యిదాటింది!

అతను లేకుండా అప్పుడే సుదీర్ఘమైన అయిదు సంవత్సరాలు గడిచిపోయాయి.

అతనిచ్చిన ఈ జీవితం అతను లేకుండానే సాగిపోతోంది. ఈ రోజు ఆరో వర్ధంతి! ప్రతి సంవత్సరం లాగానే ఈ రోజు పలు ప్రజా సంఘాలతో కలిసి గిరిజన సంఘాలు ఘనంగా వర్ధంతి సభను ఏర్పాటు చేస్తున్నాయి.

ఆమె ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ ఫోన్ గణగణ మోగింది. అది ఆదివాసి సంఘటన కార్యకర్త గౌరుది. "అమ్మా... ఈ రోజుకి 21..." అంటున్నాడతను పొంతన లేని మాటలతో. ఆ మాటలు ఆమెకూ విసుగు తెప్పించాయి...."

"ఏమిటి నువ్వు చెబుతోంది...?" ఒక్కసారిగా కుర్చీలోంచి లేచి నిలబడి అన్నది ఆదుర్దాగా.

"అవునమ్మా... మాగోడు ఎవరూ పట్టించుకోవడం లేదు. మీరయినా మా మొర ఆలకించండమ్మా..." గౌరు వేడుకోలు ఆమెలో బి.పి.ని ఒక్కసారిగా పెంచేసింది "లేదు... అలా జరగడానికి వీల్లేదు..." హిస్టీరిక్‌గా అరచి ఫోన్ పెట్టేసిందామె. మరుక్షణం ఫోన్ బుక్ పట్టుకుని వరుసగా డయల్ చేస్తూ సభ ఏర్పాట్లలో నిమగ్నమైన కార్యకర్తలనూ, ఇతర ప్రజా సంఘాల బాధ్యుల్నీ, విలేకరులనూ పిలిచింది. గౌరు చెప్పిన విషయం వినిపించి "ఏం చేస్తున్నారు మీరంతా? ఇంత మంది చనిపోతున్నా మీకేం పట్టలేదా?" అంటూ నాయకుల్ని నిలదీసింది.

ఒక్కొక్కళ్లూ తామిచ్చిన విజ్ఞాపన పత్రాల వివరాలూ, ఆందోళనకు సిద్ధమవుతున్న తీరూ తెలిపారు. అలా కాదు. "వెంటనే జిల్లా వైద్య ఆరోగ్య శాఖనూ, కలెక్టరేట్‌నూ దిగ్బంధనం చెయ్యండి. నేను విలేకరుల్ని తీసుకొని ఏజెన్సీకి వెడతాను. వెంటనే బయలు దేరండి..." అంటూ అందుకు సిద్ధమయ్యిందామె.

వారంతా తటపటాయించి, "ఈ రోజు సార్ వర్ధంతి ఉందిగదమ్మా... ఎక్కడెక్కణ్ణుంచో వక్తలొస్తున్నారు. దాన్నాపితే బాగుండదు. రేపు ఆపనే చేద్దామని నిర్ణయించుకున్నాం...." నసిగారు.

"అలా కాదు. సభలు కాదు ఇప్పుడు జరగాల్సింది. తక్షణ కార్యాచరణ! వక్తలు ఆ మాత్రం అర్థం చేసుకోకపోరు. వారిని కూడా మీతోపాటు కార్యాచరణలోకి తీసుకెళ్లండి. ఆదే ఆయనకు నిజయమైన నివాళి అని నా అభిప్రాయం. పదండి.. ఆ 'నిస్సహాయుల ప్రాణాలు కాపాడండి..." కర్తవ్య బోధ చేసిందామె.

❋

గాత్రం ఆపేసిన 'అందాల రాముడు'

డా॥ జె.పి.వైద్య

"ఉత్సాహానికి ఎంతో బలం ఉంటుంది. ఉత్సాహాన్ని మించినది మరొకటి లేనేలేదు. నిజానికి, ఉత్సాహవంతుడైన మనిషికి దుర్భరమైనది ఏదీ లేదేమో ఈ ప్రపంచంలో!"

మనం ఎంత మామూలు గాళ్ళమైనా, కొత్త సినిమా రిలీజు కాగానే, అన్ని పనులు పక్కన పడేసి ఉత్సాహంతో, అరువు తెచ్చుకున్న 'రూక'లతో 'బుకింగ్ విండో' దగ్గరికి కిందా మీదా పడి చేరుకుంటున్నామా? లేమా?

ఫస్ట్ డే- ఫష్షో చూసి తరించి, తర్వాత ఓపిగ్గా బఠాణీలు నములుతూ...

"ఏందో అనుకున్నా తమ్మీ! కాని, ఈడు బాగు పడ్డు. ఎంత కంపు సేన్మా తీసినా, మనం హౌలాగాణి తీరు ఎట్లన్న చూసి చత్తం అన్కుంటాండు.

ఈసారి నీ యవ్వ....! ఈణి సేన్మకు ఉర్కి వచ్చి చూసుడు బేకార్ భైసాబ్" అని తనివి తీరా 'ఉతకడం' కూడా చేస్తుంటాం కదా!

సినిమాల పుణ్యమా అని మనకు కొన్ని డైలాగులూ, కొటేషన్లూ, పద్యాలూ, పాటలూ కంఠతా వచ్చేశాయి. క్లాసుల్లో పాఠాలూ, పుస్తకాల్లో మతలబులూ ఎన్నడూ 'దిమాగ్' కెక్కలేదు, కానీ, సేన్మా ముచ్చట్లు మన ఒంటి నిండా అలుముకొని మనలను పావనం చేసి పారేశాయి.

'మనిషి జీవితంలో అంది వచ్చే చిన్న చిన్న అవకాశాలు, అతను భవిష్యత్తులో అధిరోహించబోయే అభ్యున్నతి శిఖరాలకు పరమపదసోపానాలు' అనే మాట కూడా చక్కగా అర్థమైపోయింది మనకు.

ఆ తరం వాళ్ళకు 'పురేయ్! మన వెండి తెరను పరిపాలించిన రెండే రెండు పేర్లను చెప్పు...' అని ప్రశ్నిస్తే టక్కున జవాబొస్తుంది.

'ఎన్టీఆర్'.... ఏయన్నార్' అని.

ముక్కోటి దేవతల్లో ఏ దేవుడికైనా అందంగా అంటుకుపోయి తెలుగువాడి గుండెల్లో 'దేవుడి'గా నిలిచిపోయిన అమరుడు 'ఎన్టీఆర్'. మనలో కొందరు ప్రేమతో 'అన్నా' అనీ.... మరి కొందరు ఇంకాస్త కల్తీలేని ప్రేమాభిమానంతో 'ఎంటోడు' అని పిలుచుకున్నారు. మంచోళ్ళు దేవుళ్ళక్కూడా అవసరం కాబోలు!

ఆ తరంలోని వెండి తెర 'బంగారు మనుషులు' చాలా మంది మబ్బుల కావలకు వెళ్లిపోయారు.

పోయినోళ్ళు అందరూ మంచోళ్ళే!

కాని, ఇంకా మనతో ఉన్నోళ్ళు 'అంతకన్నా మంచోళ్ళు అనేమాట మనం జ్ఞాపకం ఉంచు కోవాలి. ఎందుకంటే వాళ్ళు ఆ తరానికీ - ఈ తరానికీ వారధుల్లా ఇంకా మన మధ్యే ఆరోగ్యంగా నటిస్తూ ఉన్నారు. అది మనం చేసుకున్న అదృష్టం.

'ఎన్టీఆర్' దేవుళ్ళ రూపంలో ఇంకా జ్ఞాపకం వస్తుంటారు. అసలు మనం మరచి పోయిందెప్పుడనీ?

కాని, తెలుగు సినీ దర్దీ గాళ్ళ 'ఎవర్ గ్రీన్ స్టార్' ఏయన్నార్ - అడపా దడపా 'దేవుడైనా' సాంఘికాల్లో తిరుగులేని 'పచ్చపచ్చసార్ వారు'.

మన ఆంధ్రుల ఆరాధ్య కథనాయకుడాయన.

నవలల్లో 'హీరో' ఇలా ఉండాలీ... ఉంటాడూ... అని నిరూపించాడాయన.

సామాన్యుడు అసామాన్యుడిగా ఎదగడంతో పాటు, అలనాడు నాటకాల్లో ఆడవేషాలు వేసినా, తెలుగు సినీ వినీలాకాశంలో 'స్టెప్స్'ను ప్రవేశపెట్టిన ఆదినాయకుడాయన. అక్కినేని అందుకోని ఎత్తుల్లేవు. అవార్డుల్లేవు.

'అవార్డ్' ఆయన చెంత చేరి మురిసిపోయింది.

ఈ పూట మనం మురిసిపోయేది ఆయన అలనాటి గాన పటిమను తలచుకొని. చలన చిత్రాల దునియాలో ప్రవేశించిన తొలి రోజుల్లో ఆయన గాయకుడు కూడా! 'జానా - బెత్తెడు' రోల్లో పూనకం వచ్చినట్టు వొళ్ళు ఊపి మహానాయకుడి స్టైల్లో కదిలిపోయే ఈ తరం 'మహానుభావులు' ఆయన దగ్గర్నించి 'నటన'తో పాటు 'వినయం' కూడా కాస్త నేర్చుకుంటే మంచిదేమో!

'....అ౦! ఏముందండీ ? నేనింత గొప్ప గాయకుడినీ- అంత గొప్ప గాయకుడినీ అని గొప్పలేమున్నాయి చెప్పుకోడానికీ? నాకున్న పరిధిలో, నాకొచ్చినంత పాడాను. పరిధి దాటిపోతుందని గ్రహించి మానుకున్నాను. బహుశా మానుకొని మంచి పనే చేసి ఉంటాననుకుంటున్నా. అయితే, మానుకున్నది నా లోపాలను గ్రహించే. దానివల్ల నా నటనను మెరుగు పర్చుకున్నానేమో! జయభేరిలో 'రసిక రాజ తగువారము కామా', మహాకవి కాళిదాసు లో 'మాణిక్యవీణ', 'సువర్ణ సుందరి' లో 'హాయి హాయిగా ఆమని సాగే' లాంటి అద్భుతమైన పాటలకు 'లిప్ మూవ్‌మెంట్స్' ఇవ్వటంలో ఎంతో సహాయ పడింది నా గాత్ర విద్య... ఎన్ని వందల పాటలో ఆ తర్వాత...' అని ఆనందంగా నవ్వుతూ తలచుకుంటారాయన నేటికీ.

'స్వీయ లోపం బెరుగుట పెద్ద విద్య... లోపమెరిగిన వాడే పూర్ణుడౌ నరుడౌను..." అనే సూక్తి సార్థకం అయింది.

ఆ పాత రోజుల ముచ్చట్లలోనూ ఓ రకమైన వింత ఆనందం ఉంది. సుగంధం ఉంది. ఆ రోజుల్లో గుళ్ళల్లో భజనలూ, కోలాటాలూ, చెక్క భజనల్లాంటి గాలితరం పాటలు సాగేవి. ఆడపిల్లల్లేని లోటును తీర్చు కోవడంకోసం ఏయన్నార్‌ను 'అమ్మాయి'లా అలంకరించుకొని చూసి మైమరచి

1948 ప్రాంతంలో మన హీరోగారు ఏదో పాట 'సాధన'(!) చేస్తుంటే పక్కనే ఉన్న భానుమతి గారు '...అబ్బా! హీరోఁఁ ! పాటాఁఁ!! అని చేతులతో చెవులు మూసుకున్నారు. హీరో కళ్ళు తెరిచారు. 'రార్!' అని గాత్రం ఆపేశారు. అదృష్టం కొద్ది 'ఘంటసాల' గొంతు నందించారు.

అప్పటి నుండి 'చిట పట చినుకులు' ఘంటసాలవి. పెదాలు కదల్చే పని మన హీరోది'...



పోయేది ఆ తల్లి. దానికి తగ్గట్టు సన్నటి మెత్తటి పట్టు దారం గొంతు ఉన్న 'బాల నాగేసర్రావ్' అమ్మాయిల్లా కూని రాగాలు తీస్తూ, స్కూలు వార్షికోత్సవాల్లో 'చంద్రమతి' వేషం వేసి మురిపించేవాడు.

శృతి, రాగం గురించి ఏ మాత్రం జ్ఞానం లేకున్నా వాళ్ళమ్మగారు అస్తమానం 'ఆ' పద్యాలనే పాడించుకోవటం. అంతే ఆర్తిగా పాడి విన్పించటం తల్లీ తనయుల 'ఫేవరెట్ టైం పాస్' అన్నమాట. అంతంత మాత్రమే ఉన్న ఆర్థిక పరిస్థితివల్ల చదవాలని ఉన్నా 'పాఠశాల'కు దూరం అయి పోయాడాయన. కాని, తర్వాతి రోజుల్లో 'కాలేజీ' వాళ్ళ కన్నా గొప్ప 'సంస్కారం, పాఠాలు' జీవితం నేర్పింది. చిన్నప్పటి గాలిపాటలే అయినా, రాగాల్లో అభినివేశం ఉండాలని తపన పడి 'భద్రాచారి' గారి దగ్గర కాస్తంత రాగాల పద్ధతులూ గట్రా నేర్చుకున్నారు.

ఆ తర్వాతి పాఠాలు 'మోటూరు వీర రాఘవయ్య' గారి దగ్గర సాగాయి. ఆయన 'కుదరవల్లి నాటక సమాజం'లో హార్మోనిస్టుగా ఉండేవారు. నాగేశ్వరరావు పట్టుదలగా 'కనకతార' నాటకంలో తార పాత్ర పద్యాలూ, పాటలూ వారి దగ్గర ఎంత 'పట్టు'తో నేర్చుకున్నాడంటే, ఆ పాటలకు ప్రేక్షకుల 'వన్స్‌మోర్'లు టంచన్‌గా వచ్చేవి.

ఆ తర్వాత ముచ్చటగా మూడవ గురువు 'స్థానం నరసింహారావు' గారి దగ్గర హార్మోనిస్ట్‌గా ఉన్న 'బుద్ధి రాజు శ్రీరామమూర్తిగారు! మన 'నాగేసర్రావ్' గారు బుద్ధిమంతుడిలా ఆయన దగ్గర "చలి చలి విటుడా" అనే పాటను బాగా వొంట పట్టించుకున్నారు.

అది విప్రనారాయణ నాటకంలో విప్రనారాయణను దేవదేవి వలలో వేసుకునేందుకు పాడే పాట.

నాటకాల్లో ఆడవేషాలేస్తూ గొంతు 'అమ్మాయి'లాగే ఉండాలన్న తపనతో సోడాలకూ, తమల పాకులకూ దూరంగా ఉండేవారు.

అందువల్లే కాబోలు పందొమ్మిదేళ్ళ ప్రాయం వచ్చినా- గొంతు ఒకటిన్నర శృతిలో, చక్కగా తారాస్థాయిల్లోనే ఉండి పోయింది.

సాధారణంగా 14-15 సంవత్సరాల మధ్యలో గొంతు మారి మంద్రమయ్యే తంతు నాగేశ్వరరావు గారి విషయంలో జరగలేదు. నాటకాల్లో, ఆడపాత్రల్లో, ఆడగొంతు పద్యాల్లో, పాటల్లో జీవితం 'హాయిగా' సాగిపోయింది.

దుక్కపాటి మధుసూధన రావు గారు, కోడూరి అచ్చయ్యగారు ఆయన నాటకాలు చూసి మురిసిపోయారు. వారి 'ముదినెపల్లి . ఎక్సెల్షియర్' నాటక సమాజంలోకి లాక్కున్నారు. తిండి, వసతి ఫ్రీ, పైగా ప్రతి ప్రదర్శనకూ ఐదు రూపాయలు. పాన్ లేలా దగ్గర నిలబడి 'ఫుస్స్ ఫుస్స్' మని సిగరెట్టూది పారేసే మన బోటి సరదా రాయుళ్ళు 'ఆc! వెధవ ఐదు రూపాయలా?' అని 'ఫుస్స్' మనొచ్చు. కాని, అవి 'అలనాటి ఐదు రూపాయలు!

జీవితంలో 'క్రమశిక్షణ' అక్కడే అలవాటయిందాయనకు. సంగీతం ఒక పద్ధతిలో 'నిర్దిష్టం'గా సాగి - రాగాలూ, రాగమాలికలూ ఒక క్రమాన పడటమూ అక్కడే. ఆ 'క్రెడిట్' పెండ్యాల నాగేశ్వరరావు గారికి దక్కాలి. 'ఆశాజ్యోతి' - 'భారతి' - 'సత్యాన్వేషణ' లాంటి అభ్యుదయ నాటకాల్లో మన నాగేసర్రావ్ స్త్రీ పాత్రలూ, ఆడగొంతు పాటలూ సజావుగా సాగిపోసాగాయి.

1941 ప్రాంతం అది.

మొదటి సినిమా 'ధర్మపత్ని' - పిల్లలతో 'ఇందుగలడందులేడని సందేహము వలదు' పద్యాలు. పి. పుల్లయ్య, శాంతకుమారి లాంటి వాళ్ళ చూపులు పడ్డాయి. 'సీతారామ జననం'లో 'రాముడి పాత్ర' కోసం పిలుపొచ్చింది అలనాటి ప్రఖ్యాత దర్శక నిర్మాత 'ఘంటసాల బల రామయ్య' దగ్గర్నించి. వేమూరి గగ్గయ్య, ఋష్యేంద్రమణి, కమలా కోట్నీస్ లాంటి హేమాహేమీలున్నారక్కడ. మన బక్క పల్చటి పీల శరీరం 'హీరో'గారు, తన ఎముకల గూడు పర్సనాలిటీ బయట పడకుండా ప్యాడింగులూ గట్రా తగిలించుకున్నారు. లక్ష్మణుడిగా వేసిన పొద్దుటూరు రాజు మంచి గాత్రధారి. నాటకాల బ్యాక్‌గ్రౌండ్ ఉన్నవాడు. సంగీతం ప్రభల సత్యనారాయణ, ఓగిరాల రామచంద్రరావు గారిది.

'గురుబ్రహ్మ...' శ్లోకం గట్రా డైరెక్ట్ టేక్‌లో హాయిగా పాడేశారు. పాలుగారే చెక్కిళ్ళ రాముడ్ని చూసి గూడవల్లి రామబ్రహ్మం గారు కాసేపు తలపట్టుకొని 'అవునూ...! ఇందులో రాముడెవరు! సీత ఎవరూ? 'అని మొహం మీద అనేశారు. సీత వేషం వేసిన 'బాల త్రిపుర సుందరి' - శ్రీరాములవారైన 'నాగేసర్రావు'ను చూసి ఫక్కుమంది.

ఆ తర్వాత మాయాలోకం (45)లో శరాబంది రాజు పాత్ర. 'మందులున్నాయ్... బాబూ... మందులున్నాయ్...' పాట, 'రామ చాలింక నీదు బీరముల్' పద్యం..., ప్రతిభావారి 'ముగ్గురు మరాఠీలు' (46)లో హీరోయిన్ టి. జి. కమలాదేవితో 'చల్ చల్ వయ్యారి షికారీ'-'జై జై భైరవ త్రిశూలధారీ' అనే పాట, శారదా వారి 'పల్నాటి యుద్ధం' (47)లో బాలచంద్రుడిగా, మాంచాల (ఎస్. వరలక్ష్మి)తో కలిసి పాడిన యుగళగీతం' 'ఓహో చారుశీలా'.... 'మానవ నైజంబు మానలేనైతి' అనే శ్రీనాథుడి ద్విపద, బాలరాజు (48)లో 'చాలురా వగలు'-'చెలియా కనరావా' (ఎస్. వరలక్ష్మి) ఇలా నాగేసర్రావ్ గాత్రం వీరవిహారం సాగించింది.

1948 ప్రాంతంలో మన హీరోగారు ఏదో పాట 'సాధన'(!) చేస్తుంటే పక్కనే ఉన్న భానుమతి గారు '...అబ్బా! హీరోcc ! పాటాcc!! అని చేతులతో చెవులు మూసుకున్నారు. హీరో కళ్ళు తెరిచారు. 'రాక్!' అని గాత్రం ఆపేశారు. అదృష్టం కొద్ది 'ఘంటసాల' గొంతు నందించారు.

అప్పటి నుండి 'చిట పట చినుకులు' ఘంటసాలవి. పెదాలు కదల్చే పని మన హీరోది'... 'కాదూ... వద్దూ' అంటే మిస్సమ్మ (55) సావిత్రి దగ్గర సంగీతం నేర్చుకుంటూ 'మీకు మీరే మాకు మేమే' అనే బిట్ సాంగ్ మటుకు 'నాగేసర్రావుగారిదే' సోవ్హాట్!

అంతకన్నా 'పరమాణువులంత' -బిట్ గాళ్ళం మనం లేమూ? మనకోసం పెదాలు కదిపే అందాల రాముడ్ని భుజం మీద ఎక్కించు కొని మురిసిపోవడానికీ?

✻

దీనిపై మీ స్పందనను రచయితకు తెలియచేయవచ్చు.

ఫోన్ : 08732223622

చూద్దామా...

బట్టమేక పక్షులు

అరుదైన పక్షుల సంరక్షణ కేంద్రం
రోళ్ళపాడు అభయారణ్యం


బట్టమేక పక్షి గుడ్లు

1982లో అరుదైన బట్టమేక పక్షిని (గ్రేట్ ఇండియన్ బస్టర్డ్) కనుగొన్నారు. దీంతో వీటి సంరక్షణకు నడుం బిగించారు. సుమారు 937 హెక్టార్ల భూమిని సేకరించి పక్షుల సంరక్షణకు ఏర్పాటు చేశారు. కోట్లాది రూపాయల వ్యయంతో ఈ బట్టమేకల సంరక్షణ కేంద్రం ఏర్పాటు చేసి పక్షుల వసతికి ఏర్పాటు చేశారు. వీటితో పాటు అనేక అరుదైన పక్షిజాతులను తర్వాత కనుగొన్నారు.

బట్టమేక పక్షి

గ్రేట్ ఇండియన్ బస్టర్డ్‌గా పిలువబడే ఈ పక్షి అంతరించిపోయిందనే దశలో రోళ్ళపాడు బరక భూముల్లో కనుగొన్నారు. ప్రతి ఏటా అక్టోబర్‌లో వచ్చి జనవరి వరకు నివశించి వెళ్ళిపోతుంటాయి. ఏడాదికి ఒక్కసారి గుడ్డుపెట్టే ఈ పక్షులు వీటి గుడ్డును వేరే జాతి స్పర్శ తగిలితే పొదగవు. గుడ్డుపెట్టిన 21రోజుల్లో పక్షిపిల్ల బయటికి వస్తుంది. తేమ శాతం తక్కువగా ఉండే గడ్డి బరకల్లో ఇవి విహరిస్తాయి. పంటపొలాలను ఆశించే పురుగులు, మిడతలు వీటి ఆహారం. ఇవి రైతులకు మంచి మిత్రులు. మొదట్లో 150 నుండి 200 దాకా ఉన్న ఈ పక్షులు వాతావరణ పరిస్థితుల్లో మార్పులు, రైతుల పంటపొలాల్లో క్రిమిసంహారక మందులు ఎక్కువగా వాడడంతో తగ్గిపోయాయి. ఈ సంవత్సరం 15 పక్షులున్నాయి. వీటి కాళ్ళకు మూడువేళ్ళు ఉండడం వల్ల వెనుక కాలు వేగంగా కదలదు. అందువల్ల రేగడి భూముల్లో ఇది సంచరించదు. రాతినేలలు, బరక భూములే అనువైనవి.

అత్యంత అరుదైన వన్యప్రాణి సంరక్షణ కేంద్రంగా కర్నూలు జిల్లాలోని రోళ్ళపాడు అభయారణ్య కేంద్రం ప్రసిద్ధి పొందింది. గడ్డిబరక భూముల్లో ప్రపంచంలోనే అంతరించిపోతున్న అత్యంత అపురూపమైన పక్షిజాతుల్ని కనుగొనడంలో రోళ్ళపాడు గుర్తింపులోకి వచ్చింది.

హరియర్స్

అరుదైన పక్షి జాతుల్లో ఇది ఒకటి. ఇది కూడా అక్టోబర్ నెలలో వచ్చి జనవరి నెలలో వెళ్ళిపోతుంది. అలగనూరు రిజర్వాయర్ పరిసరాల్లో ఎక్కువగా ఉంటుంది. గద్దలతో వైరం కారణంగా సాయంత్రం వేళల్లో బయటికి వస్తుంది.

హరియర్స్ పక్షి

కామన్ వాక్‌కుక్

క్యాటిల్‌గ్రేట్, షెల్‌డెక్, బ్లాక్‌బుల్ టవర్స్, కింగ్‌ఫిషర్ వంటి నీటి పక్షులు ఇక్కడ అగుపిస్తున్నాయి. ఈ పక్షులు అక్టోబర్ నెలలో వచ్చి జనవరిలో వెళ్ళిపోతుంటాయి.

గ్రేహారన్‌బుల్

ఆహ్లాదకరమైన, వీనుల విందైన కూతతో చిన్నదిగా ఉన్న ఈపక్షి ఎంతో అందమైనది. తోక, ముక్కు, శరీరం కంటే పెద్దదిగా ఉంటుంది.

సంరక్షణ

ఈ పక్షులు నాశనం కావడానికి కారణమైన జింకల నుండి రక్షణగా 5కిలోమీటర్ల విస్తీర్ణంలో సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. రూ. 80వేలతో దాచ్‌టవర్, మూడు చెక్‌డ్యాంలు, రెండు నీటికుంటలు ఏర్పాటు చేశారు. వన్యప్రాణుల తాగునీటి అవసరాల కోసం రూ. 70వేలతో 10 సాసర్ పిట్స్ ఏర్పాటుచేశారు. రూ. 10 లక్షలతో పర్యాటక కేంద్రాన్ని సహజ సిద్ధంగా ఏర్పాటు చేశారు.



పరిసరాల కలుషితంతో ముప్పు

ఈ సంరక్షణ కేంద్రం చుట్టూ రైతులు గతంలో కొర్ర, వేరుశనగ, కంది, జొన్న వేయడం వల్ల వీటికి ఆహారం బాగా దొరికేది. అయితే ఇటీవల రైతులు మొక్కజొన్న, పొద్దుతిరుగుడు, శనగ వంటి వాణిజ్య పంటల వైపు మొగ్గు చూపడంతో క్రిమిసంహారక మందులు ఎక్కువగా ఉపయోగించడం వల్ల, అధిక వర్షాలు, అకాల వర్షాలతో బట్టమేక పక్షి మనుగడ ప్రశ్నార్థకంగా మారింది.

కృష్ణజింక

అందమైన వర్ఛస్సుతో కదలాడే కన్నులతో ఛెంగు ఛెంగున గంతులేస్తూ చూపరులను ఆకట్టుకొనే కృష్ణజింకలు ఈ బరక భూముల్లో వృద్ధి చెందాయి. సుమారు 1500 దాకా ఉండే ఈ కృష్ణజింకలు రైతుల పంటపొలాలను నాశనం చేయడం, బట్టమేక పక్షుల సంచారానికి ఆటంకం కలగడంతో స్పెషల్ డ్రైవ్ చేపట్టి వీటిని నల్లమల అరణ్యంలోకి తరలించారు. ఇంకా దాదాపు 800ల వరకూ జింకలున్నట్లు తెలుస్తోంది.

❋

అరిసెలు



కావలసిన పదార్థాలు

బియ్యం- 2 కప్పులు, బెల్లం - 200 గ్రాములు, నెయ్యి- పావు కిలో, నువ్వు పప్పు - ఒక టేబుల్ స్పూన్, యాలకులు-5

తయారు చేసే విధానం

బియ్యం శుభ్రంగా కడిగి నానబెట్టుకోవాలి. తర్వాత వడేసి ఎండలో పొయ్యాలి. రోట్లో వేసి మెత్తగా పిండి కొట్టాలి. జల్లెడ పట్టాలి. బెల్లం తీగపాకం వచ్చే వరకు మరగించాలి. సరయిన పాకం వచ్చాక పాకంలో వరిపిండి కలపాలి. ఎక్కడా పిండి ఉండలు కట్టకుండా శుభ్రంగా కలపాలి. ఇప్పుడు పాకం చలిమిడి తయారవుతుంది. అందులో యాలకులపొడి కలపాలి. సపోటాకాయంత చలిమిడి తీసుకొని అరిటాకు మీద వొత్తాలి. అరిటాకుకి నూనె రాస్తే చలిమిడి బాగా పరుచుకుంటుంది. అరిసె లాగా తయారు చేసిన తర్వాత, దానికి రెండు వైపులా నువ్వులు వొత్తాలి. మూకుడులో నెయ్యి బాగా మరగనిచ్చి - అందులో అరిసెను వేయించాలి. ఒలా ఒక్కొక్కటే వేయించుకుని తీసి పెట్టుకోవాలి. అరిసెకి నెయ్యి బాగా పీల్చుకునే గుణం ఉంది. వాటిని అపకలతో గట్టిగా వొత్తితే నెయ్యంతా కారిపోతుంది.

అరిసెలను పంచదారతో కూడా చేసుకుంటారు. అరిసెలు నెయ్యిలో దేవితేనే బాగుంటాయి. అందుచేత కడాయిలో ఎక్కువ నెయ్యి వుండేలా చూసుకోవాలి. తర్వాత ఈ నెయ్యిని వేరే వంటలకి ఉపయోగించు కోవచ్చు. పాలలో రంగరించిన కొంచెం మిఠాయిరంగు పాకంలో వేస్తే అరిసెలు రంగు తేలి చూడ్డానికి చాలా బావుంటాయి.

ముర్గ్ చాలీ

కావలసిన పదార్థాలు

చికెన్ - కేజీన్నర
అల్లం+ వెల్లుల్లి పేస్ట్ -100 గ్రాములు
కారం - 20 గ్రాములు
ధనియాల పొడి- 20 గ్రా॥
ఉప్పు - తగినంత
గరమ్ మసాలా పొడి- 15 గ్రా॥
ఉల్లిపాయలు - తగినన్ని
పెరుగు - 1 లీటరు
చిక్కుడు గింజలు - 200 గ్రా॥ (ఉప్పు వేసి ఉడకపెట్టుకోవాలి)
నెయ్యి - 350 గ్రా॥
కొత్తిమీర - 1 కట్ట
యాలకులు- 10గ్రా॥, దాల్చిన చెక్క- 10 గ్రా॥, బిరియానీ ఆకు- 5 గ్రా॥
లవంగాలు - 5 గ్రా॥



బూందీ లడ్డు

కావలసిన పదార్థాలు

శనగపిండి- 1 కిలో, పంచదార-1 కిలో, జీడిపప్పు- సరిపడా, యాలక్కాయలు-10, మంచి నూనె - 1 కిలో, బియ్యం పిండి - కొంచెం
కిస్‌మిస్- సరిపడా

తయారు చేసే విధానం

శనగ పిండి శుభ్రంగా జల్లించి పెట్టుకోవాలి. నూనె బాండీలో పోసి స్టౌ మీద పెట్టి కాగనివ్వాలి. ఆ తరువాత పిండిలో నీళ్లు కలిపి కొంచెం పలుచగా చేసుకోవాలి. దాన్ని చిల్లుల గరిటలో పోసి చేత్తో బాండీ పైన తిప్పండి. పిండి చిన్న చిన్న ఉండలుగా నూనెలో పడి ఉడుకుతాయి. ఇవి కాస్త మెత్తగానే వేయించి తీసి పక్కన పెట్టుకోండి. అలా పిండంతా వేసేయాలి. ఇవన్నీ పక్కన పెట్టి ఒక వెడల్పాటి మందపాటి గిన్నెలో పంచదార వేసి కొంచెం నీరు పోసి స్టౌ మీద వుంచండి. ఇది కాస్త తీగ పాకం వచ్చిన తరువాత యాలక్కాయల పొడి వేసి తిప్పండి. తర్వాత కాస్త నెయ్యి వేసి తిప్పి, వండి పెట్టుకున్న బూందీని దీనిలో వేసి కిందకు దింపి కలయబెట్టండి. ఇది వేడి మీదే ఉండలు కట్టుకుని ఒక్కో జీడి పప్పు-కిస్‌మిస్ ఉండకు అంటించి నొక్కి పెట్టండి. ఇలాగే బెల్లంతో కూడా చేసుకోవచ్చు. కాకపోతే బూందీ కాస్త గట్టిగా వేగాలి. ఉండలు కట్టలేకపోతే పళ్లెంలో అచ్చుగా వేసి ముక్కలుగా తుంచుకోవచ్చు. ఇవి ఇరవై రోజుల వరకు నిల్వ వుంటాయి.

తయారు చేసే విధానం

చికెన్‌ను నాలుగు పెద్ద ముక్కలుగా కోసుకొని, బాగా కడిగి శుభ్రం చేసుకోండి.

పాన్‌లో నెయ్యిని వేడి చేసుకొని, యాలకులు, లవంగాలు, దాల్చిన చెక్క, ఆకులు వేసి కలపండి. తరిగిన ఉల్లి ముక్కలు వేసి, బంగారు వర్ణం వచ్చేంత వరకూ వేయించండి. పెరుగును బాగా కలిపి, పాన్‌లో వేయండి. అల్లం, వెల్లుల్లి ముద్ద, కారం, ధనియాలపొడి, ఉప్పు, గరం మసాలా పొడులను చల్లి, కలిపి ఆ మిశ్రమం సగం ఉడికిన తరువాత కోడి ముక్కలను వేసి కలిపి సన్నని సెగమీద ఉడకనివ్వండి. సగం ఉడికిన తరువాత ఉడికించిన చిక్కుడు గింజలను వేసి కోడి ఉడికేంత వరకు సన్నని సెగమీద ఉంచి దించండి.


భార్యభర్తల మధ్య చిచ్చు పెడుతున్నారు....!!
V. Rama krishna


సంక్రాంతి సీజనే కదా...
అంచేత వాటిని పెట్టాను!
కంటి ఆసుపత్రి
శేఖర్


ఏదైనా పనికిరానిదుంటె తీసుకురా... భోగి మంటల్లో వేద్దాం....!!
V. Rama krishna


తెల్లార్లు నాతోపాటు కలిసి ముగ్గులెయ్యడానికి అలసి పోకుండా ఉండడానికి ఇవన్నీ తినిపిస్తున్నాను పిన్నీ!
బి. పురుషోత్తం


అబ్బా! నీ బందవస్తం చాల్లే ఊరుకో! కాకపోతే ముగ్గు వేయడానికే మూడ్రోజులు లీవిచ్చారని నువ్వలా సంబరపడిపోతే ఎలా?
LEAVE
బి. పురుషోత్తం


సంక్రాంతి బోనస్‌తోపాటు కాస్త ముగ్గు పిండినికూడా ఇవ్వమని మేనేజర్‌ని అడగమంది రా మా ఆవిడ.
BUS STOP
బి. పురుషోత్తం


వెయ్యి ముగ్గులు పెట్టి పోటీలో మొదటి బహుమతి కొట్టేసిందోయ్ మా ఆవిడ!!


మీ ఆవిడ కిడ్నాప్ అయ్యిందా? ఎలా?
అర్ధరాత్రి దాకా రథం ముగ్గేస్తూ దాని తాడుని నగర శివార్ల వరకూ లాక్కెళ్ళింది సార్.....
కిడ్నాపులు
రాష్ట్రంలో పెరిగిపోతున్న కిడ్నాపులు!
శేఖర్



తమాషా తరువులు

చెట్లు పెద్దగా ఉండొచ్చు, విశాలంగా ఉండొచ్చు. అప్పుడప్పుడూ అందంగానూ, కొన్ని సార్లు విచిత్రంగా కూడా ఉండొచ్చు. కానీ చెట్లను ప్రత్యేకంగా కత్తిరించి, పెంచి, జోడించి విచిత్రాకృతులలో చేయడం... అద్భుతం. అటువంటి వాటితో పాటు మనకు బాగా తెలిసిన ఊడల మర్రి, ఎవరో చెట్టుని తిరగేసి నేలలో పాతి, వేర్లు బయటకు కనిపించేలా చేశారనిపించేటట్టు ఉండే బోబాబ్ చెట్టు... చెట్టు మొదలుపై గడ్డి గుచ్చారా అన్నట్టుండే గడ్డి చెట్టు ... భలే ఉన్నాయి కదూ!

- యాజీవ్

కలంస్నేహం

హాయ్ చిన్నారి నేస్తాలూ!

మీక్కూడా వీళ్లలాగా కలంస్నేహం చెయ్యాలని ఉందా? మరి ఆలస్యం ఎందుకు? ఒక పోస్ట్‌కార్డు తీసుకుని మీ పేరు, వయసు, తరగతి, స్కూలు, హాబీలు, చిరునామా రాయండి. ఆ తర్వాత మీ **కలర్‌ఫోటో**ను అతికించి పోస్టు చెయ్యండి. అంతే ఎంచక్కా ప్రచురిస్తాం. అన్నట్టు, ఈ పుస్తకాన్ని మీ స్నేహితులకూ చూపించి అన్ని విషయాలూ చెప్పండి. వాళ్లకు కూడా కలంస్నేహం చెయ్యాలని వుంటే కార్డు మీద రాసి మాకు పంపమనండే. మరి మా అడ్రస్: కలం స్నేహం, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.

పేరు : మంచాల వైష్ణవి
చదువు: 5వ తరగతి
వయసు: 9 సం॥
స్కూలు : శ్రీ శారదా బాల కుటీర్, ఒంగోలు
లక్ష్యం: డాక్టర్ కావడం
హాబీలు : పుస్తకాలు చదవడం, ఆటలు ఆడటం
చిరునామా : మంచాల వైష్ణవి, డాటరాఫ్: వెంకట సుబ్బయ్య, ఒంగోలు.

పేరు: చెలకబత్తిన రవికుమార్
చదువు: 5వ తరగతి
స్కూలు: ఎం.పి.పి.ఎస్, నేలపట్ల
లక్ష్యం: పోలీసు కావడం
హాబీలు : పుస్తకాలు చదవడం, ఆటలు ఆడటం, టీవీ చూడడం
చిరునామా: సి.హెచ్. రవికుమార్, సన్నాఫ్: నాగేశ్వరరావు, నేలపట్ల, కూసుమంచి, ఖమ్మం.

పేరు : కొప్పుల నవీన్
చదువు: 5వ తరగతి
స్కూలు : యంపి పిఎస్, నేలపట్ల
లక్ష్యం: లాయర్ కావడం
హాబీలు : ఆటలు ఆడడం
చిరునామా : కొప్పుల నవీన్, సన్నాఫ్: వెంకన్న, నేలపట్ల, కూసుమంచి, ఖమ్మం.

పేరు : ఆర్. హర్షిణి
చదువు: 5వ తరగతి
స్కూలు : సెంట్ జాన్స్ గ్రామర్ స్కూల్, అబిడ్స్
లక్ష్యం: డాక్టర్ కావడం
హాబీలు: పాటలు పాడడం, పుస్తకాలు చదవడం
చిరునామా : ఆర్. హర్షిణి, డాటరాఫ్: ఆర్. రామారావు, తిరుమల టవర్స్, ముసారం బాగ్, హైదరాబాద్

పేరు : ఎస్.కె. షఫి సుహైల్
చదువు: 8వ తరగతి
వయసు: 13 సం॥
స్కూలు : త్రివేణి టాలెంట్ స్కూల్
లక్ష్యం: డాక్టర్ కావడం
హాబీలు : టీవీ చూడడం, ఆటలు ఆడడం
చిరునామా : ఎస్.కె. షఫి సుహైల్, డాటరాఫ్: అఫ్జల్, 5-1-24 కవిరాజ్ నగర్, ఖమ్మం.

పేరు : నక్క నిఖిల్
చదువు: 1 వ తరగతి
వయసు: 6 సం॥
స్కూలు : లిటిల్ బర్డ్స్
లక్ష్యం: ఇంజనీర్ కావడం
హాబీలు : కార్టూన్ ఛానళ్లు చూడడం, ఆటలు ఆడడం
చిరునామా : నక్క నిఖిల్, సన్నాఫ్: నక్క రాజేష్, 41-28/8-47, రాణిగారితోట, విజయవాడ, కృష్ణా జిల్లా.